


RNIREGD.No.APTEL/2012/42650

# ప్రజారక్ష

తెలుగు దినపత్రిక

PRAJA RAKSHA TELUGU DAILY

అమరావతి | సంపుటి : 13 | సంచిక : 118 | గురువారం 29-05-2025 | పేజీలు : 8 | వెల : రూ.5/-

Published from Amaravathi :Circulated at Srikakulam Vijayanagaram Visakhapatnam East Godavari West Godavari Krishna Guntur Prakasam Nellore Chittoor Kurnool Kadapa Ananthapuram Hyderabad



**రిపోర్టర్స్ కావలెను**

ప్రజా గళమై వెలువడుతున్న 'ప్రజారక్ష దినపత్రిక' కు రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గ, మండల కేంద్రాలలో బ్యూరో ఇన్చార్జెస్, స్టాఫ్ రిపోర్టర్స్, రిపోర్టర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అనుభవం ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.

జి.ఎమ్.: 9177191888


## ఎన్టీఆర్ అంటే మూడు అక్షరాలు కాదు...
## తెలుగువారి ఆత్మ గౌరవం: సీఎం చంద్రబాబు







**కడప(ప్రజారక్ష):**

ఎన్టీఆర్ అంటే మూడు అక్షరాలు కాదని..తెలుగువారి ఆత్మ గౌరవం, పేదవారి గుండెల్లో తీపి జ్ఞాపకమని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రభుత్వం అంటే పాలకులు కాదు సేవకులని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. సమాజమే దేవాలయం- ప్రజలే దేవుళ్లు అని నినదించి, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. ఎన్టీఆర్ జయంతి అంటే తెలుగువారికి పండుగ రోజని, ఎన్టీఆర్ స్ఫూర్తితో పేదరికం లేని సమాజం ఒక్క టీడీపీతోనే సాధ్యమని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు ఘనంగా నివాళులర్పించారు. మహానాడు వేదికపై ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులకు, ప్రజలకు పిలుపునిచ్చారు.

**తెలుగు తేజం, పౌరుషం, ఆత్మగౌరవం ఎన్టీఆర్**

మహానాడుకు సముద్రంలా పోటెత్తి వచ్చిన తెలుగు తమ్ముళ్లకు, చెల్లెమ్మలకు, టీడీపీ వీరాభిమానులకు అందరికీ నమస్కారం. మహానాడు తొలి రోజు పలు కీలక అంశాలపై మనం చర్చించుకున్నాం. నిన్నటి మహానాడు చర్చలు ఎంతో అర్థవంతంగా, పార్టీని మరింత బలోపేతం చేసేలా...రాష్ట్ర ప్రజలకు మేలు చేసేలా సాగాయి. ఈ రోజు మన పార్టీ వ్యవస్థాపకులు, తెలుగు తేజం, తెలుగు ప్రజల ఆత్మగౌరవ శిఖరం, తెలుగు పౌరుషం, సినీ-రాజకీయ సార్వభౌముడు... నందమూరి తారక రామారావు జయంతి. మహనీయులు, కారణ జన్ములు ఎన్టీఆర్ గారికి మహానాడు వేదికగా ఘన నివాళులు అర్పిద్దాం. సాధారణంగా ఒక వ్యక్తిని గాని, ఒక సినిమా హీరోను గాని, ఒక రాజకీయ నాయకుడిని గాని కొంత మంది వ్యక్తులు, కొన్ని సమూహాలు, కొన్ని వర్గాలు అభిమానిస్తాయి. కానీ తెలుగు జాతి మొత్తం అభిమానించే, ఆరాధించే ఏకైక నాయకుడు ఎన్టీఆర్. ఎన్టీఆర్ జయంతి అంటే తెలుగు జాతికే పండుగ రోజు. ప్రతి ఒక్కరూ స్మరించుకునే రోజు. మనకు తెలిసిన, మన కళ్ల ముందు కనిపించిన యుగపురుషుడు ఎన్టీఆర్. ఒకే వ్యక్తి రెండు రంగాల్లో రారాజుగా రాణించడం మనం చరిత్రలో చూడలేదు.

**సినీ-రాజకీయాల్లో సింహం :**

ఎన్టీఆర్ జీవితంలో ఎన్నో మలుపులు %-% మరెన్నో మెరుపులు, ఇంకెవరి జీవితంలో లేని మజిలీలున్నాయి. ఒక సాధారణ ప్రభుత్వ ఉద్యోగిగా ప్రస్థానం మొదలుపెట్టి.. తెలుగు సినీ చరిత్రలో ఎవరెస్ట్‌గా ఎదగడం.. ప్రజల కోసం పార్టీ పెట్టి ముఖ్యమంత్రి కావడం.. అనితరసాధ్యం. ఎన్టీఆర్ జీవితం పూల పాన్పు కాదు...నిరంతర పోరాటంతోనే ఎదిగారు. స్వీయ క్రమశిక్షణ, నీతి నిజాయితీ, పట్టుదల ఆయన ఆభరణాలు. పాలు అమ్ముతూ చదువుకున్నా, ప్రభుత్వ ఉద్యోగం చేసినా, సినిమాల్లో నటించినా, రాజకీయాల్లోకి వచ్చినా ఆత్మగౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని వీడలేదు. ఒక సామాన్య రైతుబిడ్డగా పుట్టి.. 33 ఏళ్లు వెండితెర జీవితంలోనూ, 14 ఏళ్లు రాజకీయ జీవితంలోనూ అద్వితీయ చరిత్ర సృష్టించారు. అందుకే, ఎన్టీఆర్ పేరు తలుచుకుంటే చాలు... నరాల్లో ఉత్తేజం వస్తుంది. కొండనైనా ఢీ కొట్టగలం అనేంతగా ఆత్మవిశ్వాసం వస్తుంది. పట్టుదల వస్తుంది. ఎన్టీఆర్ విగ్రహం ఒకసారి చూసి మీరు ఏ సంకల్పం చేసినా అది సాధించే శక్తి మీకు వస్తుంది.చైతన్య రథంపై తెలుగు రాష్ట్రాల్లో తిరుగుతూ నాటి అవినీతి రాజకీయాలపై, ప్రభుత్వ వైఫల్యాలపై ఆయన గర్జించారు. ఆయన ప్రసంగాలు చూస్తుంటే ఆకాశం ఉరిమినట్టు ఉండేది. పార్టీ పెట్టి తొమ్మిది నెలల్లోనే ముఖ్యమంత్రి అయిన రికార్డ్ సృష్టించిన వ్యక్తి ఒక్క ఎన్టీఆర్ మాత్రమే.

**ఎన్టీఆర్ అంటే పేదవాడికి భరోసా**

ఎన్టీఆర్ అంటే పేదవాడికి భరోసా. రైతుకు నేస్తం.. తాడిత పీడితులకు ధైర్యం... యువతకు భవిష్యత్తు... మహిళలకు అండ... కార్మికులకు అభయం.... అన్ని వర్గాలు కీర్తించే ఏకైక నాయకుడు మన ఎన్టీఆర్ . తనను వెండితెర ఇలవేల్పు చేసిన తెలుగుప్రజల రుణం తీర్చుకునేందుకు ఆయన రాజకీయాల్లోకి వచ్చారు. అందుకే ఎంత కష్టమైనా వెనకడగు వేయలేదు. 60 ఏళ్ల మయసులో రాజకీయాల్లోకి వచ్చి చరిత్ర సృష్టించారు. అవినీతి రాజకీయాలను కడిగి పారేయాలని పట్టుదలే ఆయన్ను రాజకీయాల్లో తీసుకొచ్చింది. 'సమాజమే దేవాలయం-ప్రజలే దేవుళ్లు' అనేది పార్టీ సిద్ధాంతంగా మార్చారు. అధికారం అంటే బాధ్యత అని చాటి చెప్పారు. పదవి అంటే సేవ చేసే అవకాశమని నిరూపించారు. పాలకులు అంటే సేవకులు అని చెప్పి దేశ రాజకీయాల అర్థాన్నే మార్చిన నాయకుడు ఎన్టీఆర్. ఎన్టీఆర్ పార్టీ పెట్టి....కూడు గూడు గుడ్డ తన విధానం అన్నారు. పార్టీ గుర్తులో ఇల్లు, నాగలి, చక్రం తో తన ప్రాధాన్యాలు వివరించారు. 43 ఏళ్ల క్రితం ఎన్టీఆర్ రూపొందించిన జెండా శాశ్వతంగా ఉంటుంది. తెలుగుజాతి ఉన్నంతవరకూ ఎన్టీఆర్ గుర్తుంటాడు. ఈ జెండా ప్రజలకు సేవ చేస్తుంది.


**రాజకీయాల్లో కొత్త ఒరవడికి నాంది**

పసుపు జెండా అంటే...దేశ రాజకీయాల్లో కొత్త ఒరవడికి నాంది పలికిన జెండా! పసుపు జెండా అంటే....తెలుగు వారిని అభివృద్ధి పథాన నడిపించిన జెండా. తెలుగువారి ఆత్మ గౌరవాన్ని చాటి చెప్పిన జెండా, తెలుగవారిలో ఆత్మవిశ్వాసాన్ని చాటి చెప్పిన జెండా. పసుపు జెండా అంటే....ఆడబిడ్డలకు అండగా నిలిచిన జెండా...పసుపు జెండా అంటే....రైతన్నల కన్నీరు తుడిచి వెన్నంటే ఉన్న జెండా... పసుపు జెండా అంటే...విజన్ తో తెలుగుజాతికి విజయాన్నిచ్చిన జెండా! తెలుగు ప్రజల నమ్మకం, విశ్వాసం, భవిష్యత్, భరోసా! ఆ జెండా చూస్తుంటు ఎక్కడ లేని విశ్వాసం వస్తుంది. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన తో పాలనలో కొత్త ఒరవడికి ఎన్టీఆర్ ఆద్యులుగా నిలిచారు. పేదవాడికి పట్టెడన్నం పెట్టాలని రెండు రూపాయలకు కిలో బియ్యం తెచ్చారు. అందరికీ పక్కా ఇళ్లు... బడుగులకు జనతా వస్త్రాలు అందించారు. వృద్ధాప్య పెన్షన్లు, రూ.50కే హార్స్ పవర్ విద్యుత్, గురుకుల పాఠశాలల ఏర్పాటు, పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం, మహిళలకు ఆస్తి హక్కు.. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, ఉద్యోగాల కల్పన, పరిశ్రమల ఏర్పాటు, రోడ్ల నిర్మాణం... ఇలా సంక్షేమాన్ని - అభివృద్ధిని సమతుల్యం చేశారు. పటేల్ %-%పట్వారి వ్యవస్థ రద్దు, సింగిల్ విండో విధానం, బీసీలకు, మహిళలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ప్రవేశపెట్టింది ఎన్టిఆరే.

**రాజకీయాల్లోకి రాకముందే ప్రజా సేవ :**

రాజకీయాల్లోకి రాకముందు కూడా ఎన్టీఆర్ ప్రజల కష్టాల గురించే ఆలోచించేవారు. అందుకే ప్రజలు కష్టాల్లో ఉంటే నేనున్నానంటూ ముందుకొచ్చి సాయం చేసేవారు. 1952 సంవత్సరంలో రాయలసీమలో కరువు వచ్చినప్పుడు,1962లో భారత్%-%చైనా మధ్య యుద్ధం జరిగినప్పుడూ విరాళాలు సేకరించారు. 1965లో భారత్ పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం జరిగినప్పుడు, 1972లో రాష్ట్రంలో కరువు వచ్చినప్పుడు, 1977లో దివిసీమ ఉప్పెన సంభవించినప్పుడు వేలాది మంది చనిపోయారు. ఆ సమయంలో నేనున్నానని అండగా నిలిచిన వ్యక్తి ఎన్టీఆర్ . మార్చి 29, 1982లో టీడీపీ ఏర్పడిన రోజు . ఈ మార్చికి 43 ఏళ్లయింది. 4 దశాబ్దాల్లో ఎన్నో మైలురాళ్లు దాటాం. ఎన్టీఆర్ ఆశయాలను, సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్తున్నాం. ఆయన స్ఫూర్తితోనే సంక్షేమానికి, సంస్కరణలకు పెద్దపీట వేస్తున్నాం. 2024లో ప్రజలిచ్చిన తీర్పుతో విధ్వంసం నుంచి అభివృద్ధి వైపు ముందుకెళ్తున్నాం. పేదరికం లేని సమాజం కోసం మన నాయకుడు తపించారు. ఆయన ఆశయం కోసం శాశ్వతంగా పేదరిక నిర్మూలన చేసి ఆర్థిక అసమానతలు తగ్గించి ప్రతి ఒక్కరి జీవితంలో జీవన ప్రమాణాలు పెంచాలనేది టీడీపీ సంకల్పం. నా తెలుగు కుటుంబం , ఆరు శాసనాలు... ఈ రెండు గేమ్ ఛేంజర్ గా తయారవుతాయి. ఎన్టీఆర్ ఆశీస్సులు మనపై ఎప్పుడూ ఉంటాయి. 2047 నాటికి ప్రపంచంలోనే అగ్రభాగంలో తెలుగు జాతి నిలుస్తుంది. ఎన్టీఆర్‌కు ఘన నివాళులు అర్పిస్తూ, ఉన్నతంగా ఎదగాలి, విజయం సాధించాలని ఈ కడప మహానాడులో సంకల్పం తీసుకుందామని సీఎం చంద్రబాబు అన్నారు.

## మణిపూర్‌లో వరుసగా మూడు భూకంపాలు



న్యూఢిల్లీ(ప్రజారక్ష): ఈశాన్య భారతదేశం మణిపూర్ బుధవారం భూకంపాలతో కుదిపింది. ఒకే రోజులో మూడు సార్లు భూమి కంపించడం అక్కడి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసింది. భూకంపాలపై పరిశోధనలు చేసే నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వివరాలు వెల్లడించింది. చురాచాంద్‌పూర్ జిల్లాలో బుధవారం ఉదయం 1:54 గంటలకు మొదటి భూకంపం నమోదైంది.

ఇది రిక్టర్ స్కేలుపై 5.2 తీవ్రతతో నమోదు అయింది. ఈరోజు భూకంపాల్లో ఇది మిక్కిలి శక్తివంతమైనదిగా గుర్తించారు. ఈ మొదటి భూకంపానికి కొన్ని నిమిషాల తరువాతే మరో ప్రకంపన సంభవించింది. తెల్లవారుజామున 2:26కి నోనెయ్ జిల్లా వణికింది. దీని తీవ్రత మాత్రం తక్కువగా, 2.5గా నమోదు అయింది. కానీ భూమి కదలికతో ప్రజలు మళ్లీ ఇంటి బయటకు పరుగులు పెట్టారు.

ఉదయం 10:23కి మూడవసారి భూమి కంపించింది. ఇది మళ్లీ చురాచాంద్‌పూర్ జిల్లాలోనే జరిగింది. ఈసారి తీవ్రత 3.9గా నమోదైంది. వరుస ప్రకంపనలతో ప్రజలు ఒక్కసారిగా కలవరానికి లోనయ్యారు. ఈ భూకంపాలపై అధికార యంత్రాంగం వెంటనే స్పందించింది. క్షేత్రస్థాయిలో పరిస్థితులను సమీక్షించారు. ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని వారు స్పష్టం చేశారు. ఆస్తులనూ ఎలాంటి నష్టం కలగలేదని నివేదికలు తెలియజేశాయి.

**భద్రత కోసం ముందస్తు చర్యలు**

విపత్తుల నిర్వహణ బృందాలు అప్రమత్తమయ్యాయి. స్థానిక ప్రజలకు సమాచారాన్ని అందిస్తూ భద్రతా సూచనలు ఇచ్చారు. అవసరమైతే పునరావాస కేంద్రాల ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వ ప్రకటనలు వచ్చినప్పటికీ, ప్రజల్లో చిన్నపాటి భయం నెలకొంది. "ఇది ఇప్పటికీ అంతమవుతుందా?" అనే సందేహాలు వారి మధ్య ఉన్నాయని చెప్పవచ్చు. చాలా మంది రాత్రంతా బయటే గడిపారు.

## తిరుమల మెట్ల మార్గన చిరుతల కలకలం
### టీటీడీ కీలక నిర్ణయాలు



(ప్రజారక్ష): తిరుమలలోని అలిపిరి మెట్ల మార్గం, శ్రీవారి మెట్ల మార్గం, ఘాట్ రోడ్ల పరిసర ప్రాంతాల్లో ఇటీవలి కాలంలో చిరుత పులుల సంచారం పెరుగుతున్న నేపథ్యంలో, భక్తుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం అప్రమత్తమైంది.

భక్తుల క్షేమం దృష్ట్యా తిరుపతిలోని గోకులంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో టీటీడీ ఈవో జే. శ్యామల రావు, అదనపు ఈవో సీహెచ్. వెంకయ్య చౌదరి, అటవీ శాఖాధికారులు, ఆరోగ్య, విజిలెన్స్, రెవెన్యూ, పంచాయతీరాజ్ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అలాగే, వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ రమేష్ కృష్ణమూర్తి, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సెల్వం, డీఎఫ్ఓ వివేక్ ఆనంద్, టీటీడీ డీసీఎఫ్ శ్రీనివాసులు వంటి కీలక అధికారులు కూడా హాజరయ్యారు.

## చిన్నారి హత్యాచార ఘటనపై పవన్ కళ్యాణ్ సీరియస్



అమరావతి(ప్రజారక్ష): ఆంధ్రప్రదేశ్ కడప జిల్లా మైలవరం మండలం కంబాలదిన్నెలో ఓ చిన్నారిపై జరిగిన అత్యాచారం- హత్యోదంతంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించారు. ఈ ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.

కడప జిల్లా మైలవరం మండలంలో కంబాలదిన్నె గ్రామంలో ఇటీవలే మూడేళ్ల బాలికపై మోరగుడికి చెందిన దూదేకుల రహ్మతుల్లా అనే యువకుడు మద్యం మత్తులో అత్యాచారానికి ఒడిగట్టిన విషయం తెలిసిందే. ఈ ఘాతుకం బయటికి రాకూడదనే కారణంతో బాలికను దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన పట్ల పవన్ కళ్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆగ్రహావేశాలను వ్యక్తం చేశారు. చిన్నారులపై అఘాయిత్యాలు ఇంకా ఎంతకాలం? అంటూ ప్రశ్నించారు. యావత్ సమాజం తలదించుకునే ఆకృత్యానికి పాల్పడిన నరరూప మృగాళ్ళను కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు.

## రైతులకు గుడ్‌న్యూస్..
### వరికి మద్దతు ధర పెంచిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ(ప్రజారక్ష): ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఐదు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రైతులకు ప్రభుత్వం వరాలు ప్రకటించింది. ఎమ్మెస్పీ 50శాతం పెంచింది. కేబినెట్ సమావేశం అనంతరం కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వివరాలు వెల్లడించారు.

రైతుల కోసం కీలక నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. గత పది పదకొండేళ్లలో ఖరీఫ్ పంటలకు ఎమ్మెస్పీ భారీగా పెరిగిందన్నారు. 2025-26 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు ఎమ్మెస్పీ పెంపునకు ఆమోదం చెప్పింది. 2025-26 ఖరీఫ్ సీజన్‌కు వరికి క్వింటాల్‌కు రూ.69 మద్దతు పెంచింది.

తాజాగా పెంపుతో రూ.2,369 పెరిగిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. రైతులకు వడ్డీ రాయితీ కింద రూ.15,642 కేటాయించినట్లు పేర్కొన్నారు. జొన్నలు క్వింటాల్‌కు రూ.328, సజ్జలు క్వింటాల్‌కు రూ.150, రాగులు క్వింటాల్ రూ.596, మొక్కజొన్న క్వింటాల్‌కు రూ.175 పెంచినట్లు కేంద్రమంత్రి పేర్కొన్నారు. కందిపప్పు క్వింటాల్‌కు రూ.450, పెసర్లు క్వింటాల్‌కి రూ.86, మినుములు క్వింటాల్ రూ.400, వేరుశెనగ క్వింటాల్ రూ.480 పెంచినట్లు వివరించారు.

## బంగాళాఖాతంలో బలపడ్డ అల్పపీడనం - ఏపీ వైపు వాయుగుండం

అమరావతి(ప్రజారక్ష): బంగాళాఖాతాన్ని తాకిన నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. మరింత విస్తరిస్తోన్నాయి. దక్షిణ అరేబియా సముద్రం, మాల్దీవులు, కొమోరిన్ రీజియన్, బంగాళాఖాతం దక్షిణ-మధ్య ప్రాంతం, ఈశాన్య బంగాళాఖాతం ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదలుతున్నాయి. దీనికి అనుకూల వాతావరణ పరిస్థితులు మరింత దోహదపడ్డాయి. ఇప్పటికే కేరళ, తమిళనాడు దక్షిణ ప్రాంతం, కర్ణాటక కోస్తా తీర ప్రాంత జిల్లాల్లోకి రుతు పవనాలు ప్రవేశించాయి. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు పడుతున్నాయి. సోమవారం నాడే రాయలసీమ ప్రాంతంలోకీ నైరుతి రుతుపవనాలు అడుగుపెట్టాయి. మిగతా ప్రాంతాలకూ క్రమంగా విస్తరిస్తోన్నాయి. అదే సమయంలో బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం మరింత బలపడిందని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఒడిశా తీరం వెంబడి వాయవ్య బంగాళాఖాతంలో ఈ అల్పపీడన ఏర్పడింది. ఉపరితల ఆవర్తనం మంగళవారం ఉదయం 8:30 గంటల సమయానికి ఒడిశా తీరం వెంబడి వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనంగా మారింది.

ఈ తెల్లవారు జామున 5:30 గంటల సమయానికి ఈ అల్పపీడనం మరింత ఉధృతంగా మారింది. అదే ప్రాంతంలో కొనసాగుతోంది.

# అమెరికాలో కొవిడ్‌తో వారానికి 350 మంది మృతి!

## అగ్రరాజ్యంలో కరోనా విజృంభణ
## మరణాలు పెరుగొచ్చని అంచనా
## ఎన్‌బీ.1.8.1 వేరియంట్ కారణంగానే అధిక కేసులు



వాషింగ్టన్ : అమెరికాలో కొవిడ్-19 వైరస్ విజృంభిస్తున్నది. వందల్లో మరణాలు నమోదవుతున్నాయి. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక రోగులు వంటి హైరిస్క్ గ్రూప్ వారికి కరోనా ప్రాణ సంకటంగా మారిందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికాలో గత నెల రోజుల్లో సగటున వారానికి 350 వరకు కరోనా మరణాలు నమోదైనట్లు సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) గణాంకాలు చెప్తున్నాయి. ఇవి మరింత పెరగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం అమెరికాలో నమోదవుతున్న కేసుల్లో అత్యధికం ఎన్‌బీ.1.8.1 వేరియంట్‌వే అని సీడీసీ తెలిపింది. చైనాలో మళ్లీ కొవిడ్ కేసులు పెరగడానికి, ఇతర ఆసియా దేశాల్లో కేసులు నమోదు కావడానికి ఈ వేరియంటే కారణం.

కొత్త వేరియంట్ కేసులు అమెరికాలోని వాషింగ్టన్, కాలిఫోర్నియా, న్యూయార్క్ సిటీ, వర్జీనియా తదితర రాష్ట్రాల్లో రోజూ నమోదవుతున్నాయని అధికారులు చెప్తున్నారు. ఆయా రాష్ట్రాల్లోని విమానాశ్రయాల్లో విదేశీ పర్యాటకులకు పరీక్షలు నిర్వహించగా ఎన్‌బీ.1.8.1 వేరియంట్ బాధితులను గుర్తిస్తున్నట్టు తెలిపారు. చైనా, జపాన్, దక్షిణ కొరియా, ఫ్రాన్స్ తదితర దేశాల ప్రయాణికుల్లో ఈ వైరస్‌ను గుర్తిస్తున్నామన్నారు.

ఒహియో, హవాయి తదితర రాష్ట్రాల్లో స్థానికుల్లోనూ ఈ వైరస్ సోకిందన్నారు. ఈ పరిణామాలపై డ్యూక్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ టోనీ మూడీ స్పందిస్తూ.. 'ఈ స్థాయిలో మరణాలు నమోదవుతున్నాయంటే వైరస్ మన చుట్టూ వ్యాపించి ఉన్నదని అర్థం. సమీప భవిష్యత్తులో కేసులు మరింత పెరిగే అవకాశం ఉన్నది' అని పేర్కొన్నారు. అమెరికాలో వ్యాక్సినేషన్ తక్కువగా నమోదవడం, ప్రజల్లో రోగనిరోధక శక్తి క్షీణించడం, సరైన వైద్య సదుపాయాలు లేకపోవడం వంటి కారణాల వల్లే కొవిడ్ విజృంభిస్తున్నదని స్పష్టం చేశారు.

### బూస్టర్ డోస్ తీసుకోవాలా?

దేశంలో కొవిడ్ కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. సోమవారం నాటికి దేశవ్యాప్తంగా 1,010 కేసులు నమోదయ్యాయి. అయినప్పటికీ ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు చెప్తున్నారు. అప్రమత్తంగా ఉంటూ సాధారణ నివారణ చర్యలు పాటిస్తే చాలని స్పష్టం చేస్తున్నారు. ప్రధానంగా కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీ లాంటి రాష్ట్రాల్లో కొవిడ్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నప్పటికీ గత వేవ్‌లతో పోలిస్తే ప్రస్తుతం ఈ ఇన్ఫెక్షన్ సోకినవారి సంఖ్య చాలా తక్కువేనని తెలిపారు. కొవిడ్ బారిన పడినవారిలో వ్యాధి తీవ్రత చాలా తక్కువగా ఉండటంతో అత్యధిక రోగులకు ఓపీడీ (ఔట్ పేషెంట్ డిపార్ట్‌మెంట్)లోనే సేవలందించి పంపించేస్తున్నామని, కేవలం కొద్ది మందికి మాత్రమే హాస్పిటల్‌లో చేరాల్సిన అవసరం ఏర్పడుతున్నదని వైద్యులు చెప్తున్నారు. ఎవరికైనా దగ్గు, గొంతు నొప్పి లేదా ఫ్లూ లాంటి లక్షణాలుంటే ఇండ్లకే పరిమితమై వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఏ రోగికైనా రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నదని భావించి వైద్యుడు సూచిస్తే తప్ప మిగతావారు బూస్టర్ డోస్ తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తున్నారు.

# ఇరాన్‌లో ముగ్గురు భారతీయులు అదృశ్యం.. రూ.కోటి డిమాండ్ చేసిన కిడ్నాపర్లు




ఇరాన్‌లో ముగ్గురు భారతీయులు అదృశ్యమయ్యారు. ఈ విషయాన్ని టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం ధ్రువీకరించింది. అదృశ్యమైన ముగ్గురి జాడ కోసం గాలింపు చేపడుతున్నట్లు పేర్కొంది. తప్పిపోయిన వారిని పంజాబ్‌లోని సంగ్రూర్‌కు చెందిన హుషన్‌ప్రీత్ సింగ్, ఎస్‌బీఎస్ నగర్‌కు చెందిన జస్పాల్ సింగ్, హొషియాపూర్‌కు చెందిన అమృత్‌పాల్ సింగ్‌గా గుర్తించారు. మే 1న టెహ్రాన్‌లో ల్యాండ్ అయిన కొద్దిసేపటికే వీరు అదృశ్యమైనట్లు ఎంబసీ తెలిపింది. ముగ్గురు యువకుల కుటుంబ సభ్యులతో టచ్‌లో ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నట్లు పేర్కొంది. మరోవైపు పంజాబ్‌లోని ఓ ఏజెంట్ ముగ్గురు యువకులను దుబాయ్-ఇరాన్ మార్గం ద్వారా ఆస్ట్రేలియాకు పంపుతానని హామీ ఇచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఇరాన్‌లో బస కల్పిస్తామని హామీ ఇచ్చి.. అక్కడ దిగగానే కిడ్నాప్ చేసినట్లు ఆరోపించారు. కిడ్నాపర్లు రూ.కోటి డిమాండ్ చేసినట్లు కూడా కుటుంబ సభ్యులు తెలిపారు. అంతేకాదు, యువకుల్ని తాళ్లతో కట్టేసి చేతుల నుంచి రక్తం కారుతున్న వీడియోని కూడా పంపినట్లు తెలిపారు.

అడిగిన డబ్బు పంపకపోతే వారిని చంపేస్తామని కిడ్నాపర్లు బెదిరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మరోవైపు ఆ ముగ్గురిని విదేశాలకు పంపిన ఏజెంట్ హొషియాపూర్‌లో కనిపించకుండా పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.



# స్పేస్‌ఎక్స్ ప్రయోగం మళ్లీ విఫలం.. అదుపు తప్పి కూలిన స్టార్‌షిప్



టెక్సాస్: బిలియనీర్ ఎలన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ కంపెనీ రాకెట్ విఫలమైంది. మంగళవారం జరిగిన తొమ్మిదవ స్టార్‌షిప్ ప్రయోగం వికటించింది. బూస్టర్ పేలడంతో.. రాకెట్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో అనుకున్న రీతిలో ప్రయోగం పూర్తి కాలేదు. పేలుడు వల్ల రాకెట్‌లో ఇంధనం లీకైంది. ఆ సమయంలో రాకెట్ గింగిరాలు తిరిగింది. దీంతో అది అదుపు తప్పింది. రాకెట్‌కు చెందిన వెహికిల్ భూ వాతావరణంలోకి తిరిగి వస్తున్ నసమయంలో.. తమ బృందం ఆ వెహికిల్‌తో ఆల్టిట్యూడ్ కంట్రోల్ చేయలేకపోయినట్లు స్పేస్ ఎక్స్ సంస్థ తెలిపింది. మార్చి నెలలో జరిగిన 8వ స్టార్‌షిప్ ప్రయోగం కూడా విఫలమైన విషయం తెలిసిందే. టెక్సాస్ నుంచి గాలిలోకి ఎగిరిన తర్వాత కాసేపటికే అది పేలింది. దాంతో అప్పుడు అనేక అమెరికా విమానాలను గ్రౌండ్ చేయాల్సి వచ్చింది. అంతరిక్ష వ్యర్థాల పట్ల వార్నింగ్ కూడా ఇచ్చారు. గత ప్రయోగంతో పోలిస్తే ఈ సారి రెండు దశలు అధికంగానే రాకెట్ దూసుకెళ్లింది. గల్ ఆఫ్ టెక్సాస్ సమీపంలో ఉన్న బ్రౌన్స్‌విల్లే నుంచి ప్రయోగం జరిగింది. మంగళవారం రాత్రి 7.36 నిమిషాలకు ప్రయోగాన్ని చేపట్టారు. స్టార్‌షిప్ వెస్సల్‌ను సూపర్ హెవీ రాకెట్ బూస్టర్ ద్వారా నింగిలోకి పంపారు.

## సనా ఎయిర్‌పోర్ట్‌పై ఇజ్రాయెల్ దాడులు..
# విమానాలు ధ్వంసం



యెమెన్‌లోని హౌతీ రెబల్స్ ఆధీనంలో ఉన్న సనా ఎయిర్‌పోర్ట్‌పై ఇజ్రాయెల్ దళాలు మరోసారి విరుచుకుపడ్డాయి. ఎయిర్‌పోర్ట్‌లోని విమానాలను ఐడీఎఫ్ ఫైటర్ జెట్లు ధ్వంసం చేశాయి. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి తాజాగా ప్రకటించారు.

సనా ఎయిర్‌పోర్ట్ లోని హౌతీ ఉగ్రవాదులే లక్ష్యంగా దాడులు చేసినట్లు తెలిపారు. హౌతీల చివరి విమానాన్ని కూడా ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఇజ్రాయెల్‌పై దాడులు చేసేవారెవరైనా సరే భారీ మూల్యం చెల్లించాల్సిందే అని ఈ సందర్భంగా హెచ్చరించారు. యెమెన్‌లోని హౌతీ రెబల్స్ పాలస్తీనాలోని హమాస్‌కు మద్దతుగా ఇజ్రాయెల్‌పై దాడులు చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది మే నెలలో హౌతీ రెబల్స్ ప్రయోగించిన క్షిపణులు బెన్ గురియన్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో పడ్డాయి. దీంతో కొన్ని విమాన సర్వీసులు రద్దయ్యాయి.


ఇక మంగళవారం హౌతీ రెబల్స్ ఇజ్రాయెల్‌లోని లక్ష్యాలపై రెండు క్షిపణులతో దాడులు చేసిన విషయం తెలిసిందే. ఈ దాడులకు టెల్ అవీవ్ తాజాగా ప్రతీకార దాడులు చేపట్టింది. సనా ఎయిర్‌పోర్ట్‌లోని హౌతీ ఉగ్రవాదులే లక్ష్యంగా ఐడీఎఫ్ ఫైటర్ జెట్లు విరుచుకుపడ్డాయి.

# భారత్ దాడితో పాక్ ఎయిర్‌బేస్ భూగర్భ కేంద్రం వద్ద భారీ గుంత.. ఉపగ్రహ చిత్రాలు

పహల్గాం ఉగ్రదాడికి భారత్ గట్టిగా బదులు తీర్చుకున్న విషయం తెలిసిందే. 'ఆపరేషన్ సిందూర్' చేపట్టి పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా విరుచుకుపడింది. భారత్ చేపట్టిన ఈ దాడులతో ఉక్కిరిబిక్కిరైన పాక్.. ప్రతిదాడులకు యత్నించింది. సైనిక స్థావరాలు, పౌర నివాసాలే లక్ష్యంగా చేసుకుంది. అయితే, పాక్ యత్నాలను మన త్రివిధ దళాలు సమర్థవంతంగా తిప్పికొట్టాయి. సరిహద్దులు దాటకుండానే పాకిస్థాన్ వైమానిక స్థావరాలు, రాడార్ కేంద్రాలపై బ్రహ్మోస్ క్షిపణులు, డ్రోన్లతో దాడిచేసి ధ్వంసం చేసింది.

భారత్ చేసిన ఈ దాడిలో మురీద్ ఎయిర్ బేస్‌కు తీవ్ర నష్టం వాటిల్లినట్టు తాజాగా వెల్లడైంది. ఆ వైమానిక స్థావరంపై భారత్ జరిపిన దాడుల తీవ్రతను హై-రిజల్యూషన్ శాటిలైట్ ఫోటోలు స్పష్టం చేస్తున్నాయి. పాక్ వాయుసేన భూగర్భ కేంద్రానికి కేవలం 30 మీటర్ల దూరంలో మూడు మీటర్ల వెడల్పుతో భారీ గుంత ఏర్పడినట్లు ఫోటోల్లో కనిపిస్తోంది. అంతేగాక, డ్రోన్ హ్యాంగర్ల పక్కన ఉన్న భవనం పైభాగంలోనూ నష్టం సంభవించింది.

దాడికి ముందు ఏప్రిల్ 16 న శాటిలైట్ తీసిన ఫోటోల్లో మురీద్ ఎయిర్ బేస్‌లోని ఓ భవనం సాధారణంగా కనిపిస్తుండగా.. మే 10 దాడి తర్వాత ఆ భవనం పూర్తిగా దెబ్బతిన్నది. భవనం పైభాగం నుజ్జునుజ్జు కావడం, గోడలకు పగుళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ ఎయిర్ బేస్ నియంత్రణ రేఖకు 150 కిలోమీటర్ల దూరంలో చక్వాల్ జిల్లాలో ఉంది. ఈ ఎయిర్ బేస్ పాక్ ఆర్మీకి చాలా కీలకం.




మరోవైపు నూర్ ఖాన్ వైమానిక స్థావరం కూడా తీవ్రంగా దెబ్బతిన్నట్లు ఉపగ్రహ చిత్రాల ద్వారా స్పష్టంగా తెలుస్తోంది. ఈ వైమానిక స్థావరం.. రావల్పిండి, ఇస్లామాబాద్ మధ్య వ్యూహాత్మకంగా ఉంది. ఏప్రిల్ 25న దాడికి ముందు అక్కడ సౌకర్యాలు చెక్కుచెదరకుండా ఉన్నాయి. అయితే, ఆపరేషన్ సిందూర్ తర్వాత మే 10న తీసిన ఫోటోల్లో రెండు కమాండ్ అండ్ కంట్రోల్ ట్రైలర్ ట్రక్కులు ధ్వంసమైనట్టు చూపుతున్నాయి. మే 17 నాటి శాటిలైట్ ఫోటోల్లో పాక్ క్లీన్-అప్ ఆపరేషన్ మొదలుపెట్టినట్లు కనిపించింది. ఇక, 7,000 చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న పాక్ సైనిక వసతి పూర్తిగా ధ్వంసమైందని, దీని మరమ్మతులు అసాధ్యమని ఇంటెల్ ల్యాబ్‌లోని జియో-ఇంటెలిజెన్స్ పరిశోధకుడు డేమియన్ సైమన్ తెలిపారు.

# క్రెడిట్‌కార్డు యూజర్లకు షాక్ ఇచ్చిన యాక్సిస్ బ్యాంక్.. ఫ్లిప్‌కార్ట్‌పై ఆ సేవలు కట్..!




యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్‌కార్డు యూజర్లకు షాక్ ఇచ్చింది. కోబ్రాండెడ్ ఫ్లిప్‌కార్ట్-యాక్సిస్ బ్యాంక్ రూల్స్‌ని మారుస్తూ నిర్ణయం తీసుకుంది. మారిన రూల్స్ ఈ ఏడాది జూన్ 20 నుంచి అమలులోకి రానున్నాయి. ఈ మేరకు యూజర్లకు బ్యాంక్ సమాచారం అందించింది. ప్రస్తుతం కార్డ్ యూజర్లకు అందిస్తున్న లాంజ్ యాక్సెస్‌ను తొలగించింది. ఇప్పటి వరకు మింత్రా షాపింగ్‌పై ఇస్తున్న క్యాష్‌బ్యాక్‌ను పెంచింది. గతంలో మింత్రాలో కొనుగోలుపై కేవలం ఒకశాతం మాత్రమే క్యాష్‌బ్యాక్ ఉండగా.. దాన్ని 7.5శాతానికి పెంచింది. స్టేట్‌మెంట్ త్రైమాసికంలో గరిష్టంగా రూ.4వేల వరకు క్యాష్‌బ్యాక్ ఇవ్వనున్నట్లు చెప్పింది.

అలాగే, ఫ్లిప్‌కార్ట్‌లో కొనుగోళ్లు, క్లియర్‌ట్రిప్‌లో బుకింగ్స్‌పై 5శాతం క్యాష్‌బ్యాక్ ఇవ్వనున్నట్లు పేర్కొంది. త్రైమాసికంలో గరిష్టంగా రూ.4వేల క్యాష్‌బ్యాక్ వస్తుందని చెప్పింది. స్విగ్గీ, పీవీఆర్, కల్ట్‌ఫిట్, ఉబర్ లావాదేవీలపై 4 శాతం క్యాష్‌బ్యాక్ బ్యాక్, ఇతర కొనుగోళ్లపై ఒకశాతం క్యాష్‌బ్యాక్ కొనసాగనున్నది. ఈజీ డైనర్‌పై 15 శాతం వరకు క్యాష్‌బ్యాక్ వస్తుండగా.. రూ.400పైగా చేసే చమురు కొనుగోళ్లపై ఒకశాతం ఫ్యూయల్ సర్‌చార్జి రద్దు వర్తించనున్నది. ఫ్లిప్‌కార్ట్ యాక్సిస్ క్రెడిట్ కార్డు యూజర్లు కొత్తగా తీసుకునేందుకు రూ.500 జాయినింగ్ ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. రెండో ఏడాది నుంచి రూ.500 రెన్యువల్ ఫీజును చెల్లించాల్సిందే. ఏడాదిలో రూ.3.50లక్షల ట్రాన్సాక్షన్స్ జరిపితే రెన్యూవల్ ఫీజు మాఫీ అవుతుంది.

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. సెన్సెక్స్ 644 పాయింట్లు డౌన్..!



దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ నష్టాల్లో ముగిశాయి. మార్కెట్‌లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ప్రపంచ మార్కెట్‌లోని ప్రతికూల పవనాలు దేశీయ మార్కెట్లపై ఆ ప్రభావం పడింది. అమెరికా బాండ్ దిగుమతి పెరగడం, ఆర్థిక పరిస్థితిపై మరోసారి ఆందోళనలు పెరగడంతో పెట్టుబడిదారులను భయాందోళనకు గురి చేశాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,323.05 స్వల్ప నష్టాల్లో మొదలైంది. రిలయన్స్, ఐటీసీ, ఇన్ఫోసిస్, ఎంఅండ్‌ఎంలో అమ్మకాల ఒత్తిడి మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. ఈ క్రమంలోనే సెన్సెక్స్ ఓ దశలో వెయ్యి పాయింట్ల వరకు పతనమైంది.

ఇంట్రాడేలో 81,323.24 పాయింట్ల గరిష్టాన్ని తాకిన సెన్సెక్స్.. అత్యధికంగా 80,489.92 పాయింట్ల గరిష్టానికి పడిపోయింది. చివరకు 644.64 పాయింట్ల నష్టంతో 80,951.99 వద్ద ముగిసింది. నిఫ్టీ 203.75 పాయింట్ల నష్టంతో 24,609.70 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 1,518 షేర్లు లాభపడగా.. 1,907 షేర్లు నష్టపోయాయి. నిఫ్టీలో ఇండస్‌ఇండ్ బ్యాంక్, బజాజ్ ఆటో, భారతీ ఎయిర్‌టెల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హీరో మోటోకార్ప్, అల్ట్రాటెక్ సిమెంట్, భారత్ ఎలక్ట్రికల్, జియో ఫైనాన్షియల్ లాభపడ్డాయి. ఓఎన్‌జీసీ, ఎంఅండ్‌ఎం, టెక్ మహీంద్రా, హిందాల్కో, విప్రో, ట్రెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, కోల్ ఇండియా, ఐటీసీ, హెచ్‌యూఎల్, రిలయన్స్ ప్రధానంగా నష్టపోయాయి.

# బ్యాంకుల్లో నగదు కొరత పెరుగుతోంది..! రుణాలతో పోలిస్తే తగ్గుతున్న డిపాజిట్లు..!




రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెండుసార్లు వడ్డీ రేట్లను 0.50 శాతం తగ్గించింది. ఆ తర్వాత నుంచి బ్యాంకులు డిపాజిట్ రంగంలో సమస్యలను ఎదుర్కొంటున్నాయి. 2024-25 బ్యాంకుల ఆర్థిక ఫలితాల ప్రకారం.. రుణాలతో పోలిస్తే డిపాజిట్లు బాగా తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం బ్యాంకుల వద్ద పుష్కలంగా నగదు ఉన్నది. కాబట్టి ఈ కొరతతో ఎలాంటి సమస్య లేదు. కానీ, భవిష్యత్తులో బ్యాంకులు నగదు కొరతను ఎదుర్కొనే అవకాశం ఉన్నది.

డిపాజిట్లు, రుణాల మధ్య అంతరం చాలా కాలంగా రూ.45-50 లక్షల కోట్ల వద్ద స్థిరంగా ఉందని ఆర్‌బీఐ డేటా పేర్కొంటున్నది. ఏప్రిల్ 18తో ముగిసిన పక్షం రోజుల్లో డిపాజిట్లు మొత్తం డిపాజిట్లు రూ.228.60 లక్షల కోట్లు కాగా.. రుణాలు రూ.181.86 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఏప్రిల్ 4న ఇది వరుసగా డిపాజిట్లు రూ.231.14 లక్షల కోట్లు ఉండగా.. రుణాలు రూ.184 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. మార్చి 21తో ముగిసిన పక్షం రోజుల్లో డిపాజిట్లు రూ.225.74 లక్షల కోట్లు ఉండగా.. రుణాలు రూ.182.43 లక్షల కోట్లుగా ఉన్నాయి. జనవరి 24తో ముగిసిన పక్షం రోజుల్లో డిపాజిట్లు 221.28 లక్షల కోట్లు కాగా.. రుణాలు 178.74 లక్షల కోట్లుగా ఉన్నాయి. జనవరి 10 నాటికి డిపాజిట్లు 221.50 లక్షల కోట్లు ఉండగా.. రుణాలు 178 లక్షల కోట్లుగా ఉన్నాయి. గతేడాది డిసెంబర్ 27తో ముగిసిన పక్షం రోజుల్లో డిపాజిట్లు 220.63 లక్షల కోట్లు కాగా.. రుణాలు 177.42 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇక డిసెంబర్ నుంచి ఆర్‌బీఐ బ్యాంకుల్లో 8.57 లక్షల కోట్లు అందుబాటులో ఉంచింది. ఇక బ్యాంకుల వారీగా రుణాల పెరుగుదల, డిపాజిట్లను పరిశీలిస్తే.. ఎస్‌బీఐలో డిపాజిట్లు 9.47శాతం.. రుణాలు 12.03శాతం పెరిగాయి. కెనరా బ్యాంకులో డిపాజిట్లు 11శాతం.. రుణాలు 11.74శాతంగా ఉన్నాయి. బ్యాంక్ ఆఫ్ బరోడాలో డిపాజిట్లు 10.30శాతం, రుణాలు 12.80శాతం.. యూకో బ్యాంక్‌లో రుణాలు 11.56శాతం, రుణాలు 17.72శాతం.. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో డిపాజిట్లు 9.11శాతం, రుణాలు 14.15శాతంగా ఉన్నాయి. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో రుణాలు 13.44శాతం, రుణాలు 17.76శాతం, ఇండియన్ బ్యాంక్‌లో డిపాజిట్లు 7శాతం, రుణాలు 10శాతం, సెంట్రల్ బ్యాంక్‌లో డిపాజిట్లు 7.19శాతం, రుణాలు 15.24శాతం, బ్యాంక్ ఆఫ్ ఇండియా 10.56శాతం, రుణాలు 13.74శాతంగా ఉన్నాయి.

# బంగారంపై లోన్ తీసుకుంటున్నారా?

## ఆర్‌బీఐ కొత్త రూల్స్ ఇవే.. ఈ 9 మార్పులు తెలుసుకోండి!




బంగారంపై రుణాలు తీసుకునే వారికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) త్వరలో శుభవార్త చెప్పనుంది. బ్యాంకులు, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీలు) అందించే బంగారు రుణాలకు సంబంధించిన నిబంధనలను ప్రామాణీకరించడానికి ఆర్‌బీఐ ముసాయిదా మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ ప్రతిపాదనలు బంగారు రుణ విధానాల్లో ఏకరూపతను తీసుకురావడంతో పాటు, రుణగ్రహీతలకు పారదర్శకతను పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నాయి.

నిపుణుల సూచనల ప్రకారం.. ఆర్‌బీఐ బంగారు ఆభరణాలు, ఆభరణాలను తాకట్టుగా పెట్టుకొని ఇచ్చే రుణాల కోసం ప్రామాణిక నిబంధనలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ స్థిరమైన మార్గదర్శకాలు రుణ పరిస్థితులపై స్పష్టతను అందించడం ద్వారా రుణగ్రహీతలకు ప్రయోజనం చేకూరుస్తాయి అని ఆయన అన్నారు. ఆర్‌బీఐ ప్రతిపాదించిన ముఖ్య మార్పులు, రుణగ్రహీతలపై అవి ఎలా ప్రభావం చూపుతాయి అనే అంశాలను ఇప్పుడు చూద్దాం.

### ఆర్‌బీఐ ప్రతిపాదించిన 9 కీలక మార్పులు:

లోన్-టు-వాల్యూ (ఎల్టీవీ) నిష్పత్తి 75%కి పరిమితం:

ఆర్‌బీఐ ముసాయిదా మార్గదర్శకాలు అన్ని బంగారు రుణాలకు ఎల్టీవీ నిష్పత్తిని 75%కి పరిమితం చేయాలని ప్రతిపాదిస్తున్నాయి. అంటే, మీ బంగారం విలువ రూ. 100 అయితే, బ్యాంక్ లేదా ఎన్బీఎఫ్‌సీ గరిష్టంగా రూ. 75 వరకు మాత్రమే రుణం ఇవ్వగలవు. ఇది కోవిడ్-19 మహమ్మారి సమయంలో తాత్కాలికంగా ఎల్టీవీని 80%కి పెంచినప్పటి నుంచి వచ్చిన మార్పు అని బజాజ్ క్యాపిటల్ జాయింట్ ఛైర్మన్ ఎండీ సంజీవ్ బజాజ్ తెలిపారు.

### బంగారం యాజమాన్య రుజువు తప్పనిసరి:

రుణగ్రహీతలు బంగారం యాజమాన్య రుజువును తప్పనిసరిగా సమర్పించాలి. కొనుగోలు రసీదులు అందుబాటులో లేకపోతే, ఒక డిక్లరేషన్ ఇవ్వాలి. "తాకట్టుగా పెట్టిన బంగారం యాజమాన్యంపై సందేహం ఉంటే రుణదాతలు రుణాలు ఇవ్వకూడదు" అని ముసాయిదా పేర్కొంది.

### ప్యూరిటీ సర్టిఫికేట్:

రుణదాతలు బంగారం స్వచ్ఛత, బరువు, మినహాయింపులు, చిత్రం విలువను వివరిస్తూ ఒక ధృవీకరణ పత్రాన్ని జారీ చేయాలి. "తాకట్టు పెట్టిన బంగారం స్వచ్ఛత, బరువు, విలువను తెలియజేస్తూ రుణగ్రహీతలకు ఒక ధృవీకరణ పత్రం అందించాలి. ఇది రుణదాత బంగారం ఎలా తనిఖీ చేస్తారు రుణం తీసుకునేటప్పుడు అది రుణగ్రహీతకు కూడా ఆమోదయోగ్యంగా ఉందని నిర్ధారిస్తుంది" అని సంజీవ్ బజాజ్ అన్నారు.

### నిర్దిష్ట రకాల బంగారానికే రుణాలు:

22 క్యారెట్లు లేదా అంతకంటే ఎక్కువ స్వచ్ఛత కలిగిన బంగారు ఆభరణాలు, ఆభరణాలు బ్యాంకులు విక్రయించిన నాణేలకు మాత్రమే రుణాలు అనుమతించబడతాయి. ఎంఎంటీసీ ద్వారా తయారైన ఇండియా గోల్డ్ కాయిన్స్ అర్హత పొందాలంటే, వాటిని బ్యాంకుల ద్వారా విక్రయించి, పైన పేర్కొన్న ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి.

### వెండిపై కూడా రుణాలు:

కనీసం 925 స్వచ్ఛత కలిగిన వెండి ఆభరణాలు, ఆభరణాలు బ్యాంకులు విక్రయించిన వెండి నాణేలపై కూడా రుణాలు తీసుకోవచ్చు. అయితే, బ్యాంకులు ప్రత్యేకంగా ముద్రించి విక్రయించిన వెండి నాణేలకు మాత్రమే రుణాలు అనుమతించబడతాయి.

### తాకట్టు బరువుపై పరిమితులు:

ప్రతి రుణగ్రహీతకు 1 కిలోల బంగారు ఆభరణాలు, 50 గ్రాముల బంగారు నాణేల పరిమితిని ప్రతిపాదించింది. అయితే, వ్యక్తిగత బంగారు వస్తువులపై నిర్దిష్ట పరిమితులు లేవు, నాణేలు మినహా అని గాబా స్పష్టం చేశారు.

### ప్రామాణిక బంగారం విలువ నిర్ధారణ:


తాకట్టు పెట్టిన బంగారం తక్కువ స్వచ్ఛతతో ఉన్నప్పటికీ, దాని విలువ 22 క్యారెట్ల స్వచ్ఛత ధర ఆధారంగా నిర్ణయించబడుతుంది.

### వివరమైన రుణ ఒప్పందాలు తప్పనిసరి:

రుణదాతలు పూర్తి తాకట్టు వివరాలు, వేలం ప్రక్రియలు, నోటీసు వ్యవధి, తిరిగి చెల్లింపు సమయాలు, రుణగ్రహీతకు వర్తించే అన్ని ఛార్జీలను రుణ ఒప్పందంలో చేర్చాలి. ఇది పారదర్శకతను పెంచుతుంది.

### సకాలంలో బంగారం విడుదల:

రుణం పూర్తిగా తిరిగి చెల్లించిన 7 పని దినాలలోపు బంగారం తిరిగి ఇవ్వాలి. ఆలస్యం జరిగితే, రుణదాత రోజుకు రూ. 5,000 జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఈ కొత్త నిబంధనలు అమల్లోకి వస్తే, బంగారు రుణాలు మరింత పారదర్శకంగా, నియంత్రితంగా మారతాయి. ఇది రుణగ్రహీతలకు, రుణదాతలకు ఇద్దరికీ ప్రయోజనం చేకూరుస్తుంది.



# జూలై 8కల్లా కుదురుస్తాం!

న్యూఢిల్లీ: జూలై 8కల్లా భారత్-అమెరికా నడుమ మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరే వీలుందని కేంద్ర ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తున్నది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత నెలలో ప్రతీకార సుంకాలకు తెరతీసిన విషయం తెలిసిందే. అయితే ఆయా దేశాలతో వాణిజ్య చర్చల్లో భాగంగా జూలై 9దాకా (90 రోజులపాటు) సదరు సుంకాల అమలును వాయిదా వేసిన సంగతీ విదితమే. ఈ క్రమంలోనే భారత్‌పై విధించిన 26 శాతం అదనపు సుంకాలు ఆగిపోయాయి. అయినప్పటికీ 10 శాతం బేస్‌లైన్ టారిఫ్‌లు మాత్రం పడుతూనే ఉన్నాయి.

ఈ క్రమంలో అమెరికాతో ట్రేడ్ డీల్‌కు మోదీ సర్కారు తీవ్రంగా ప్రయత్నిస్తుండగా, జూలై 8కల్లా ఒప్పందం కుదురుతుందన్న ఆశాభావాన్ని ఓ ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు కనబర్చారు. ప్రతీకార సుంకాల నుంచి పూర్తిగా ఉపశమనం లభించేలా కృషి చేస్తున్నట్టు ఆయన తాజాగా తెలిపారు. చర్చలు జరుగుతూనే ఉన్నాయన్నారు. నిజానికి ఇప్పటికే కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ అమెరికాకు వెళ్లి అక్కడి వాణిజ్య మంత్రితో ఈ విషయమై చర్చలు జరిపినది తెలిసిందే. అయినప్పటికీ ఇప్పటివరకైతే ఎలాంటి ఫలితం



లేకుండా ఉన్నది. మరి ప్రతీకార సుంకాల తొలగింపునకు ట్రంప్ సర్కారు ఏమాత్రం అంగీకరిస్తుందో చూడాలి.

RNLREGD.No.APTEL/2012/42650
ప్రజా రక్ష
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## ఎటు వెళ్తున్నది ప్రజాస్వామ్యం?

ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలు మాత్రమే కాదు, అది మౌలికంగా వ్యక్తిగత స్వేచ్ఛ, స్వాతంత్ర్యం గురించి నిర్వచిస్తుంది. సామాజిక నియమాలు, సంస్కృతి ఏ ప్రభుత్వంలోనైనా ఉండొచ్చు. కానీ, ప్రజాస్వామ్యం, దాని సంస్కృతి, ఆచరణ, స్ఫూర్తి మాత్రం ఒక దేశాన్ని, ఆ దేశంలోని వ్యక్తులను సాధికారికం చేయడం ద్వారా వారి ఉన్నతికి, ఉద్ధరణకు తోడ్పడాలి. అదే ప్రజాస్వామ్యం ప్రధాన ఉద్దేశం. ప్రముఖ రచయిత సి.ఎస్ లూయిస్ రాసిన ఓ వ్యాసంలో ఇలా చెప్పారు. 'ఏ వస్తువును అయినా, రచనను అయినా విమర్శించేందుకు మొదటి అర్హత ఏమిటంటే.. ముందుగా దాని గురించి తెలుసుకోవడం. అది కార్క్ స్క్రూ అయినా కావచ్చు, పవిత్ర స్థలం అయినా కావచ్చు. దాని ఉద్దేశమేమిటి? దాన్ని ఎలా ఉపయోగించాలో తొలుత తెలుసుకోవాలి. ఆ తర్వాత దాన్ని చెడు ఉద్దేశం కోసం తయారు చేశారని నిర్ణయానికి రావచ్చు. మీకు తెలియనంత వరకు దాని గురించి సరిగ్గా చెప్పలేరు, విమర్శించలేరు'. ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలు మాత్రమేనని భావించడం తప్పు. ప్రజాస్వామ్యమంటే ఓట్లు వేయడం, నాయకులను ఎన్నుకోవడం మాత్రమే కాదు. వ్యక్తి స్వాతంత్ర్యాన్ని ప్రభుత్వం అణచివేస్తే నిరంకుశత్వ ప్రభుత్వానికి, ప్రజల ద్వారా ఎన్నికైన ప్రభుత్వానికి మధ్య ఎలాంటి తేడా ఉండదు. ఎందుకంటే, రెండింట్లోనూ భావవ్యక్తీకరణ స్వాతంత్ర్యాన్ని అడ్డుకోవడం, ప్రజాభిప్రాయాన్ని నియంత్రించడం, నియంతలాగా ఏక వ్యక్తి ఆలోచనలు అమలు చేయడమే జరుగుతుంది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలకు వ్యతిరేకంగా న్యాయమూర్తి తీర్పు ఇవ్వడం చాలా ముఖ్యం. ఎందుకంటే, ప్రజాస్వామ్యంలో వ్యక్తుల స్వాతంత్ర్యాన్ని రక్షించేందుకు ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిలబడే అధికారం న్యాయమూర్తికి ఉంటుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ నిరంకుశత్వం నుంచి వ్యక్తులను న్యాయమూర్తి విముక్తి చేయాలి. ప్రభుత్వం ఎప్పుడూ వ్యక్తులను నియంత్రించాలనే చూస్తుంది. ప్రభుత్వ నిర్ణయాలు కూడా ఆ దిశలోనే ఉంటాయి. ఎందుకంటే, వ్యవస్థకు ఎల్లప్పుడూ వ్యక్తి స్వేచ్ఛ అడ్డంకిగా అనిపిస్తుంది. పైన చెప్పిన వ్యాఖ్యల అర్థం, పరమార్థాన్ని మీరు మన దేశంలో జరిగిన, జరుగుతున్న ఏదేని ఘటనతో పోల్చి చూసుకోవచ్చు. ఏదైనా ఒక్క ఘటన గురించి మాట్లాడటం కంటే, ఒక రచయితగా మన దేశం ఎటు వెళ్తున్నదో, దేశంలో ఎలాంటి మార్పులు సంభవిస్తున్నాయనే అంశాలపైనే ఎక్కువ ఆసక్తి ఉంటుంది. ప్రభుత్వం చేస్తున్న మార్పుల (చట్టాలు) వల్ల సాధారణ ప్రజానీకం ఎలా ప్రభావితమవుతున్నదో, ఆ మార్పుల పట్ల ఎలా స్పందిస్తున్నదో గమనిస్తుంటాం. అయితే, ఇప్పుడు వాటి గురించి వివరించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే, అవి చాలా కాలం నుంచి (ఈ ప్రభుత్వ పాలనలో మనం ఇప్పటికే 12వ సంవత్సరంలో ఉన్నాం) జరుగుతూనే ఉన్నాయి. ప్రజామోదం కూడా పొందాయి. ఆసక్తి ఉంటే వివరాలను పరిశీలించి ఇక్కడ జరుగుతున్నది వ్యక్తి సాధికారతను, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుం దా? లేదా దానికి విరుద్ధంగా ఉందో ఒక అంచనాకు రావచ్చు. ప్రభుత్వం మనల్ని ఒక నిర్దిష్ట దిశలో నడిపిస్తున్నది. ప్రస్తుత పాలనలో చాలా కాలం నుంచి మనం నిస్సారమైన పరిస్థితుల్లో వదిలివేయబడ్డాం. చట్టాల ద్వారా ఆ దిశ మనకు వెల్లడవుతుంది. మీరు బాగా సమర్థవంతంగా నిర్వహిస్తు న్న నిరంకుశత్వాన్ని కలిగి ఉండొచ్చు. ప్రపంచవ్యాప్తంగా, మన పొరుగు దేశాల్లో నిరంకుశత్వ ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. వ్యక్తి తనకు ఇష్టం ఉన్నా, లేకున్నా స్వా తంత్ర్యం, స్వేచ్ఛను వదులుకోవాల్సి ఉంటుంది.

## గాలివానకు టెంట్ కూలిన వెనుకడుగు వేయని రైతులు యధావిధిగా జై గ్రానైట్ ఫ్యాక్టరీ పై కొనసాగిస్తున్న నిరసనలు




కుప్పం మే 28 ప్రజారక్ష కుప్పం మండలం వేపూరు మిట్టపల్లి వానగుట్ట పల్లి పంచాయతీ రైతులు గత సుమారు 143 రోజులుగా అక్రమ జెల్లి ఫ్యాక్టరీని శాశ్వతంగా మూసేయాలని దానివల్ల అనేక విధాలుగా స్థానికంగా పంటలకు, భూగర్భ జలాలు ,బోరుబావులకు ఆవులకు, పక్షులకు శబ్దంకాలుష్యం వల్ల అనేక నష్టాలు సంభవించే అవకాశం ఉందని శాంతియుత నిరసనలో భాగంగా శాశ్వత పరిష్కారం దొరికే వరకు ఎట్టి పరిస్థితుల్లో కూడా తగ్గేదే లేదని నిరసనలను కొనసాగిస్తున్నారు అన్నదాతలు. వీటి మీద ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకొని రైతుల నిరసనను విముక్తి కల్పించాలని పలువురు చుట్టుపక్కల గ్రామ పెద్దలు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## బాపట్ల సినిమా థియేటర్లో ఆకస్మిక తనిఖీలు..

**– డివిజన్ ఇంచార్జ్ ఆర్డీవో లవన్న**



బాపట్ల, మే28(ప్రజారక్ష): బాపట్ల పట్టణంలోసినిమా థియేటర్లలో పరిశుభ్రత లోపించిన ప్రేక్షకులకు అసౌకర్యం కలిగించిన థియేటర్ల యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని బాపట్ల సబ్ డివిజన్ ఇంచార్జ్ ఆర్డీవో లవన్న అన్నారు. బుధవారం ఆయన సిబ్బందితో కలిసి బాపట్ల పరిధిలోని పలు సినిమా థియేటర్లలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. బాత్రూములు అపరశుభ్రంగా ఉండడంతో థియేటర్ యాజమాన్యాన్ని మందలించారు. థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల వద్ద టికెట్ల రుసుము అధికంగా వసూలు చేసిన, తినుబండారాల ధరలను అధికంగా వసూలు చేసిన సహించేది లేదన్నారు. కూల్ డ్రింక్స్, తినుబండారాల ధరలను థియేటర్లలో ప్రదర్శించాలని అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇకపై దియేటర్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని సినిమా వీక్షించేందుకు వచ్చే ప్రేక్షకులకు ఎటువంటి ఆటంకం కలిగించిన, పరిశు భ్రత కల్పించకపోయిన ప్రభుత్వ ఆదేశాలు మేరకు ముందుకు సాగుతామన్నారు. ఈ తనిఖీలలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు..

## ఘనంగా ఎన్టీఆర్ 102 వ జయంతి వేడుకలు



దుర్గి , మే 28 , ప్రజారక్ష : దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 102 వ జయంతి వేడుకలను దుర్గి లో టీడీపీ నాయకులు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు పగడాలు చెన్నకేశవ మాట్లాడుతూ తెలుగు జాతి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహా నేత ఎన్టీఆర్ అని అయన అన్నారు. పేద,బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కొరకు టీడీపీ ని స్థాపించి పేదల మనసుల్లో ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచారన్నారు. ఆయన అడుగు జాడల్లో సీఎం నారా చంద్రబాబు నాయుడు నడుస్తూ పేదల పెన్నిదిగా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమం లో టీడీపీ నాయకులు పాలుగోన్నారు..

## ప్రశ్న పత్రాలను ఆవిష్కరిస్తున్న డివైఎఫ్ఐ, యుటిఎఫ్ నాయకులు

**– యువజన,ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో డి.ఎస్.సి మోడల్ పరీక్ష నిర్వహణ**
**– హర్షం వ్యక్తం చేసిన అభ్యర్థులు**



నరసరావుపేట రూరల్, మే 28, (ప్రజా రక్ష) యువజన, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో డి.ఎస్.సి పరీక్షకు సిద్ధం అవుతూ అరండల్ పేట లోని శ్రీ హరిణి అకాడమీలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు మోడల్ పరీక్ష నిర్వహించారు.

ముందుగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రచురించిన డి.ఎస్.సి మోడల్ పేపర్ ను డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, జిల్లా కార్యదర్శి ఇ.ఆంజనేయ రాజు, యుటిఎఫ్ నాయకులు, శ్రీ హరిణి అకాడమీ డైరెక్టర్ కె.నరేంద్ర తదితరులతో కలిసి ఆవిష్కరించారు. రామన్న, ఆంజనేయరాజు మాట్లాడుతూ డి.ఎస్.కి కి సన్నద్ధం అవుతున్న అభ్యర్థులకు భయం, ఆందోళన పోగొట్టేందుకు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.

అభ్యర్థులకు ప్రభుత్వం నిర్వహించే డి.ఎస్.సి పరీక్షకు డివైఎఫ్ఐ ప్రచురించిన నమూనా పరీక్ష ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ నమూనా పరీక్షను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యుటిఎఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎం మోహనరావు మాట్లాడుతూ విద్య, ఉపాధి తదితర రంగాలలో యువత ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాటాలు,ఉద్యమాలు చేయడంతో పాటు సామాజిక బాద్యతగా నిరుద్యోగులకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడం పట్ల డివైఎఫ్ఐ సిబ్బందిని మోహనరావుతో పాటు యుటిఎఫ్ నాయకులు రవిబాబు, అకాడమీ డైరెక్టర్ కె నరేంద్ర అభినందించారు. మోడల్ పరోక్షలో 100 మందికి పైగా అభ్యర్థులు పాల్గొన్నారు.

# డిఆర్ఎం ఆకస్మిక తనిఖీ



గుంటూరు, మే 28. ప్రజారక్ష. బుధవారం రైల్వే డిఆర్ఎం సుధీష్ణ సేన్ గుంటూరు,మంగళగిరి స్టేషన్ లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అమృత స్టేషన్ల అభివృద్ధిలో భాగంగా మంగళగిరి స్టేషన్లో వివిధ పనుల అభివృద్ధిని పరిశీలించారు. ఈ పర్యటనలో సైమన్, జేవీ.అనూష, మనోహర్ రెడ్డి ,కమలాకర బాబు పాల్గొన్నారు. మంగళగిరి స్టేషన్ లోని అభివృద్ధి పనుల ప్రాజెక్టు వ్యయము రూ.12.56 కోట్లు. సర్కులేటింగ్ ఏరియా, ప్లాట్ఫారం సర్ఫేస్, వెయిటింగ్ హాల్స్, కోచ్ ఇండికేషన్ బోర్డులు పార్కింగ్ ఏరియా లను అభివృద్ధి చేస్తున్నామని డిఆర్ఎం తెలియజేశారు.

# కుప్పంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు



కుప్పం మే 28 ప్రజారక్ష కుప్పంలోని ఆర్టీసీ కూడలిలో దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతి వేడుకలను బుధవారం టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పేదలకు కిలో రెండు రూపాయలకే బియ్యం అందించిన ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు.

## కుప్పం కడ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు



కుప్పం మే 20 ప్రజారక్ష కుప్పం కడ కార్యాలయంలో దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతి వేడుకలను బుధవారం కడా ఎస్ఓ వికాస్ మరమ్మత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కుప్పం మున్సిపల్ కమిషనర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కడ కార్యాలయం ,మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

# ప్రతి ఒక్కరు యోగ చేయాలి



కుప్పం మే 28 ప్రజారక్ష యోగేంద్ర మాసోత్సవాలలో భాగంగా కుప్పం ఎంపిక కార్యాలయ సమావేశపు మందిరంలో బుధవారం శిక్షణ ఇచ్చారు శారీరక మానసిక ఉల్లాసానికి యోగ ఎంతో సహాయపడుతుందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు చెప్పారు .ప్రతి ఒక్కరు యోగాను అలవర్చుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## నందమూరి తారక రామారావు 102 వ జయంతిని నిర్వహించిన మాచర్ల ఎమ్మార్వో బి.కిరణ్ కుమార్.




మాచర్ల, మే 28, ప్రజారక్ష : పద్మశ్రీ అవార్డు గ్రహీత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 102 వ జయంతి సందర్భంగా బుధవారం రోజు మాచర్ల పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయంలో, తాసిల్దార్ బి.కిరణ్ కుమార్ ముందుగా నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల తాసిల్దార్ బి.కిరణ్ కుమార్ తో పాటు డి.టి మేడం బి.వాణి, సి ఎస్ డి టి. రమణ, వీఆర్వో ఆరుమళ్ళ నాగేశ్వరరావు, మరియు అధికారులు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి సాటి చెప్పిన మహనీయుడు అన్న ఎన్టీఆర్ : యాగంటి మల్లిఖార్జునరావు

మాచర్ల, మే 28, ప్రజారక్ష : యుగపురుషుడు,విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, తెలుగు వారి ఆరాధ్య దైవం, తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు, సంక్షేమానికి కొత్త బాట చూపిన సంఘ సంస్కర్త, 'అన్న' నందమూరి తారక రామారావు 102వ జయంతి పురస్కరించుకొని మాచర్ల పట్టణం లో మున్సిపల్ చైర్ పర్సన్ మదర్ సాహెబ్ మరియు మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లిఖార్జునరావు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా యాగంటి మల్లిఖార్జునరావు మాట్లాడుతూ.. పేద ప్రజలకు కూడు, గూడు, గుడ్డ అనే మూడు అవసరాలను తీర్చడమే తన జీవితాశయంగా భావించిన ధీరోదాత్తుడు అన్న ఎన్టీఆర్. 'సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు' అనే నినాదంతో ప్రజాస్వామ్యానికి కొత్త అర్థం చెప్పిన దార్శనికుడు అన్న నందమూరి తారక రామారావు. అన్నగా ఆడబిడ్డలకు ఆస్తి హక్కు ఇచ్చినా, మండల వ్యవస్థతో పాలనారంగాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లినా, పక్కా ఇళ్ల నిర్మాణంతో పేదలకు అండగా నిలిచినా, కిలో రెండు రూపాయలకే బియ్యాన్ని అందించి పేదల ఆకలి తీర్చినా %ౣ% ఏది చేసినా ఆయన మనసులో ఉన్నది ఒక్కటే%ౣ% "నా తెలుగు జాతి సగౌరవంగా తలెత్తుకు నిలబడాలి" అనే సంకల్పమే. చరిత్రలో స్థానం సంపాదించుకోవడం కాదు%ౣ% చరిత్రనే సృష్టించిన చిరస్మరణీయుడు అన్న నందమూరి తారక రామారావు ని వెల్లడించారు. ఈనాటికీ తెలుగుదేశం ఉజ్వలంగా ప్రకాశిస్తున్నదంటే అది ఆయన ఆశీర్వాదబలమే. ఆ మహనీయుడి సంకల్పాన్ని నెరవేర్చేందుకు అహర్నిశలూ కష్టపడుతూనే ఉన్నాం%ౣ%. సమసమాజాన్ని సాధించే దిశగా సాగుతున్నాం. అనితరసాధ్యమైన ఎన్నో పనులు చేసిన అన్న నందమూరి తారక రామారావు ఆశయాలకు అనుకూలంగా మన ప్రియతమ నేత నారా చంద్రబాబునాయుడు కొనసాగించటం మన తెలుగు జాతికి ఎంతో గర్వకారణమని వెల్లడించారు. దొరలు ( పటేల్ పట్వారి వ్యవస్థ) చేతుల్లో నలుగుతున్న వెనుకబడిన వర్గాలకు స్వేచ్ఛ లభించింది అంటే అది కేవలం నందమూరి తారక రామారావు వల్లనే లభించిందని మరొక్కసారి గుర్తు చేశారు. ఎన్టీఆర్ కి ఏ విషయంలోనూ ఎవ్వరూ సాటి కాదని కొనియాడారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటించిన మహానటుడు, తెలుగువారి ఆత్మగౌరవం నాయకుడు నందమూరి తారకరామారావుకి "భారతరత్న" బిరుదును ప్రకటించాలని కోరారు. పేదల కోసం 2రూ.లకే కిలో బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టిన నేత ఎన్టీఆర్ అని, మహిళలకు తండ్రి ఆస్తిలో సమాన హక్కు కల్పించిన ఘనత ఆయనకే చెందిందని పేర్కొన్నారు. ఇళ్ల పట్టాలను మహిళల పేరుపై ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడమే కాకుండా, పక్కా ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన మహోన్నత నేతగా ప్రశంసించారు. ఎన్టీఆర్ హయాంలో యువతకు ప్రాధాన్యత, ఉద్యోగాల్లో మహిళలకు రిజర్వేషన్లు, రాజకీయాల్లో 33% రిజర్వేషన్లు కల్పించడం వంటి అంశాలను గుర్తు చేశారు. వృద్ధులకు 35 రూపాయల పెన్షన్ ప్రారంభించి, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం దానిని ?4,000 వరకు పెంచిందని తెలిపారు. ఇది దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతోందని పేర్కొన్నారు. అన్న నందమూరి తారక రామారావు మనవడు నారా లోకేష్ బాబు యువగళం పాదయాత్ర మొదలుపెట్టి జనగళం, ప్రజాబలం మహిళా బలంతో రాష్ట్రమంతా మూడు వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసి తెలుగుదేశం పార్టీని ఒంటి చేత్తో అధికారంలోకి తెచ్చిన ఘనత నారా లోకేష్ బాబు కి చెల్లుతుందని అన్నారు.

మా యువ నాయకుడు నారా లోకేష్ బాబు మరియు మా కూటమి ప్రభుత్వం మీద నమ్మకంతో సంవత్సరం లోనే దాదాపుగా 5 లక్షలకోట్లు విలువచేసే పరిశ్రమలు పెట్టుబడులు పెట్టడానికి మన రాష్ట్రానికి వస్తున్నారంటే అది మా నారా లోకేష్ బాబు గొప్పతనం అని యాగంటి మల్లికార్జున రావు కొనియాడారు. సూర్య,చంద్రులు ఉన్నంతకాలం ఎన్టీఆర్ కీర్తి చిరస్థాయిగా నిలిచిపోతుంది. విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావు తన అద్భుత నటన, సుపరిపాలనతో దేశ ప్రజల దృష్టిని ఆకర్షించిన మహనీయుడు ఎన్టీఆర్ మాత్రమే అని వెల్లడించారు.

ఆయన స్థాపించిన పార్టీని ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు మంత్రి నారా లోకేష్ బాబు సమర్థవంతంగా ముందుకు నడిపిస్తున్నారన్నారు.ప్రతి ఏడాది ఎన్టీఆర్ జయంతి వేళ నిర్వహిస్తున్న మహానాడు వేడుకలు ఈఏడాది కడపలో ఎంతో అట్టహాసంగా జరుగుతున్నాయన్నారు. ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం తెలుగుదేశం పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ మద్దిగపు వెంకట్రామిరెడ్డి , మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పోలూరి నరసింహారావు , బృంగ రమణ, కౌన్సిలర్ నాగుల్ మీరా, బిజెపి నాయకులు కూనిశెట్టి వెంకటేశ్వర్లు , కౌన్సిలర్స్ దస్తగిరి , కోటి రెడ్డి , ఎం శ్రీను ,సంబోజు వేణు,, మాచర్ల వాసు , తిక్కా కొండలు, గాజుల అంజి,కొమెర అనంతరాములు, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ పెద్ద బద్రు, మహిళా నాయకురాలు కృష్ణవేణి, భవాని భాయ్ మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొని నందమూరి తారక రామారావు విగ్రహానికి నివాళులర్పించారు.



## మహిళల భద్రతే ప్రధాన లక్ష్యంగా శక్తి బృందాలు గస్తీ..

**– రద్దీ ప్రదేశాలలో ముమ్మరంగా గస్తీ నిర్వహిస్తున్న శక్తి బృందాలు**
**– శక్తి వాట్సాప్ నెంబర్ 79934 85111**





బాపట్ల,మే28(ప్రజారక్ష):మహిళల భద్రతే ప్రధాన లక్ష్యంగా శక్తి బృందాలు ముమ్మరంగా గస్తీ నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ తుషార్ దూడి ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలోని మహిళలకు రక్షణగా ఉండేందుకు సిఐ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రతి సబ్ డివిజన్ పరిధిలో శక్తి బృందాలను ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లాలో మొత్తం నాలుగు శక్తి బృందాలు విధులు నిర్వహిస్తున్నాయి. ఎస్పీ ఆదేశాలతో బుధవారం శక్తి బృందాలు రద్దీ ప్రదేశాలలో, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ప్రభుత్వ కార్యాలయాలు ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో ముమ్మరంగా గస్తీ నిర్వహిస్తున్నాయి. మహిళల భద్రత, రక్షణ కొరకు అందుబాటులోకి తీసుకువచ్చిన శక్తి యాప్ ఆవశ్యకత, దాని ద్వారా అందించే సేవలు, నిక్షిప్తం చెయ్యబడిన సమాచారం, రిజిస్ట్రేషన్ చేసుకొనే విధానం తదితర విషయాల గురించి మహిళలకు, విద్యార్థులకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. మహిళల భద్రతకు పెద్ద పీట వేస్తూ సాంకేతికత సహాయంతో మహిళలు, చిన్నారులపై జరిగే అఘాయిత్యాలకు చెక్ పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఐపీఎస్ నూతనంగా ప్రారంభించిన శక్తి వాట్సాప్ నెంబర్ 79934 85111 గురించి అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్న మహిళలు శక్తి వాట్సప్ నెంబరుకు వీడియో కాల్ (లేదా) నార్మల్ కాల్ (లేదా) మేసేజ్ చేసినా సంబంధిత కమాండ్ కంట్రోల్ రూమ్ కు సంకేతాలు వెళతాయని, వెంటనే శక్తి బృందాలు స్పందించి ఆపదలో ఉన్న మహిళలను ఆదుకోవడం జరుగుతుందని, ఈ నెంబర్ 24/7 అందుబాటులో ఉంటుందని తెలిపారు.

# జగనన్న పర్యటనను విజయవంతం చేద్దాం

**– జూన్ 3న సత్తెనపల్లిలో పర్యటించనున్న వైయస్. జగన్మోహన్ రెడ్డి**
**– గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి**




నరసరావుపేట రూరల్, మే 28, (ప్రజా రక్ష) వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జూన్ మూడవ తేదీన సత్తెనపల్లి నియోజకవర్గంలోని రెంటపాళ్ళ గ్రామంలో పర్యటించనున్నారని సత్తెనపల్లి వైసీపీ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గ వైసిపి నాయకులతో కలిసి సుధీర్ భార్గవ్ రెడ్డి మాట్లాడారు. ఏడాది క్రితం టీడీపీ నాయకుల వేధింపులకు తాళలేక ఆత్మహత్య చేసుకున్న రెంటపాళ్ళ వైసీపీ నాయకుడు, ఉప సర్పంచ్ కొర్లకుంట శివ నాగమల్లేశ్వరరావు సంవత్సరికానికి జగనన్న పాల్గొని, నివాళులర్పించనున్నట్లు తెలిపారు. అలాగే

కొర్లకుంట కుటుంబ సభ్యులను పరామర్శిస్తారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో ప్రజలకు ఎటువంటి సంక్షేమ పథకాలు అందించలేదన్నారు. సంక్షేమ పథకాలు అందించాలని ప్రశ్నిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై మాత్రం కేసులు పెట్టి వేధిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో కేబుల్క్ రెడ్ బుక్ పరిపాలనను సాగిస్తూ, అరాచకాలు చేస్తుందని దుయ్యబట్టారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో ఎప్పుడు లేని విధంగా 102 మంది వైసీపీ కార్యకర్తలపై కేసులు పెట్టారని తెలిపారు. కూటమి నాయకులు పెట్టే కేసులకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భయపడాలని, వాటిని ధీటుగా ఎదుర్కొంటామని చెప్పారు. వైసీపీ కుటుంబ సభ్యులందరూ సమిష్టిగా సమస్యలను ఎదుర్కుంటమన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ

కార్యకర్తలకు అండగా ఉంటుందని భరోసా కల్పించారు. జగనన్న పర్యటనను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## మాచర్ల తాసిల్దార్ ఆధ్వర్యంలో సినిమా థియేటర్లో ఆకస్మిక తనిఖీలు



మాచర్ల, మే28(ప్రజారక్ష): పల్నాడు జిల్లా కలెక్టర్ మరియు గురజాల రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ ఆదేశాల మేరకు మాచర్ల పట్టణంలోని వెంకటేశ్వర థియేటర్ మరియు శ్రీనివాస్ మహల్ సినిమా థియేటర్లలో పరిశుభ్రత లోపించిన ప్రేక్షకులకు అసౌకర్యం కలిగించిన థియేటర్ల యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని బుధవారం ఆయన సిబ్బందితో పరిధిలోని పలు సినిమా థియేటర్లలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.

బి-ఫారం లైసెన్స్ వ్యాలిడిటీ, ఆర్ అండ్ బి అధికారులచే ధృవీకరణ స్ట్రక్చరల్ సౌండ్ నెస్ సర్టిఫికెట్, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్, ఎలక్ట్రిసిటీ సర్టిఫికేట్ అదేవిధంగా బాత్రూములు థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల వద్ద టికెట్ల రుసుము అధికంగా వసూలు చేసిన, తినుబండారాల ధరలను అధికంగా వసూలు చేసిన సహించేది లేదన్నారు. కూల్ డ్రింక్స్, తినుబండారాల ధరలను థియేటర్లలో ప్రదర్శించాలని అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇకపై దియేటర్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని సినిమా వీక్షించేందుకు వచ్చే ప్రేక్షకులకు ఎటువంటి ఆటంకం కలిగించిన, పరిశుభ్రత కల్పించకపోయిన ప్రభుత్వ ఆదేశాలు మేరకు ముందుకు సాగుతామన్నారు. ఈ తనిఖీలలో రెవెన్యూ సిబ్బంది, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

## నూటన్స్ ఇంజనీరింగ్ కళాశాలకు "అటానమస్" స్టేటస్ గుర్తింపు.



మాచర్ల, మే 28, ప్రజారక్ష : మాచర్ల నియోజకవర్గంలోనీ మాచర్ల రూరల్ పరిధిలో గత 25 సంవత్సరముల నుండి నడపబడుచున్న న్యూ టైల్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల మాచర్ల వారికి, (%ఖ+జ%) యు.జి.సి వారు అటానమస్ స్టేటస్ గుర్తింపు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బుధవారం నూటన్స్ కళాశాలలో కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, పల్నాడు ప్రాంతంలో మా కళాశాలకు ఈ గుర్తింపు రావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కళాశాల గుర్తింపు కోసం కృషి చేసినటువంటి కళాశాల అధ్యాపకులకు, అధ్యాపకేతర సిబ్బందికి, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి, మరియు ప్రిన్సిపల్ జగదీష్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# వైసీపీ రాజకీయాల నుంచి తప్పుకోవాలి : డొక్కా మాణిక్య వరప్రసాద్



గుంటూరు, మే 28. ప్రజారక్ష. వైసీపీ ఐదేళ్ల దుర్మార్గపు పాలన కారణంగా రాష్ట్రంలో నేడు బలమైన ప్రతిపక్షం లేకుండా పోయిందని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ విమర్శించారు. రాజేంద్రనగర్లోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ,వైసీపీ తమ పార్టీని రద్దు చేసుకొని తమపై వస్తున్న కేసుల ఆరోపణలను ఎదుర్కోవాలన్నారు. కూటమి ప్రభుత్వం అద్భుతమైన పాలనను అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతోందని చెప్పారు.

# ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుక



నరసరావుపేట, మే 28, (ప్రజా రక్ష)నరసరావుపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం టీడీపి వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 102 వ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం టీడీపి నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కొల్లి బ్రహ్మయ్య వాసిరెడ్డి రవి, కపలవాయి విజయకుమార్, మార్కెట్ యార్డ్ చైర్మన్ పునాటి శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు గట్టుపల్లి సత్యనారాయణ, రొంపిచర్ల అధ్యక్షులు పల్లెల నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గాడిపర్తి సురేష్, నియోజకవర్గం మైనార్టీ అధ్యక్షులు షేక్. మాబు, కోవూరి బాబు, కొల్లిపాక చంద్రశేఖర్, నాగలక్ష్మి, రాజ్యలక్ష్మి, మాధవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్టీఆర్ 102 వ జయంతి




నరసరావుపేట రూరల్, మే 28, (ప్రజా రక్ష) పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 102 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర డాక్టర్ సెల్ ఉపాధ్యక్షులు కడియాల వెంకటేశ్వరరావు పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్న ఎన్టీఆర్ తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని ప్రపంచ నలుమూలల చాటి చెప్పిన మహనీయుడని కొనియాడారు. టీడీపీని స్థాపించిన 9 నెలల కాలంలోనే అధికారంలోకి తెచ్చిన ఘనత ఎన్టీఆర్ అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్దన్ బాబు, దాసరి ఉదయశ్రీ, తులసీరామ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యోగా చేస్తున్న జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే..

**యోగాతో సంపూర్ణ ఆరోగ్యం... జాయింట్ కలెక్టర్**





నరసరావుపేట రూరల్, మే 28, (ప్రజా రక్ష) ఈ నెల 21 నుండి వచ్చే నెల 21 వరకు నెల రోజులపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సూచనలు మేరకు నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం పల్నాడు జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రమైన కోటప్పకొండ వద్ద యోగాంధ్ర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరె, జిల్లా రెవెన్యూ అధికారి మురళి వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ యోగా అనేది ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగస్వామ్యం కావాలన్నారు. యోగ వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. అందరూ వారి వారి వసతులను బట్టి రోజుకు ఒక గంట పాటు యోగాభ్యాసం చేయాలి అన్నారు . యోగా వలన కొన్ని శారీరక రుగ్మతలు దూరమవుతాయని వెన్నుపూస, ఇతర శరీర, కండరాల నొప్పి వంటివి దూరమయ్యే అవకాశం ఉందన్నారు. భారతదేశంతో పాటు ఇతర దేశాలు కూడా యోగ ప్రక్రియను అవలంభిస్తున్నాయని యోగ సాధనపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమాన్ని కోటప్పకొండ వద్ద ఏర్పాటు చేసిన పాల్గొన్న అధికారులకు అభినందనలు తెలిపారు.

# మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి



నరసరావుపేట, మే 28, (ప్రజా రక్ష)బీ స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో బుధవారం దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమీషనర్ ఎం. జస్వంత్ రావు, ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళు లర్పించారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు అనే నినాదంతో ప్రజాస్వామ్యానికి కొత్త అర్థం చెప్పిన దార్శనికుడు అన్న ఎన్టీఆర్ అని మున్సిపల్ కమిషనర్ కొనియాడారు. కార్యక్రమములో షేక్. మహమ్మద్ రఫీ, డి. ఇ ఇ, ఎ. సాంబయ్య, టిపిఓ, కె. శ్రీనివాసరావు, ఆర్.ఓ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 40 ఏళ్ల అనుభవాల విశ్వవిద్యాలయం

**వెంటిలేటర్ పై ఉన్న ఏపీకి ఆక్సిజన్ ఇచ్చిన చంద్రబాబు : కడప మహానాడులో ప్రసంగించిన పెమ్మసాని.**



గుంటూరు, మే 28. ప్రజారక్ష. “తరం మారింది. స్వరం మారింది. అరాచకానికి కాలం చెల్లింది. “ అని గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడారు. 2024 ఎన్నికలలో అఖండ విజయం సాధించిన తర్వాత తెలుగుదేశం పార్టీ

కడపలో నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమంలో గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు. మూడు రోజుల మహా వేడుక అయిన మహానాడులో రెండవ రోజైన బుధవారం పెమ్మసాని పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

“40 ఏళ్ల అనుభవాల విశ్వవిద్యాలయం, నిత్య నూతన ఆలోచనల విజ్ఞాన క్షేత్రం అయినటువంటి ముఖ్యమంత్రి, గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఓటమికి దడవని గుండె, ఒక చేత్తో పసుపు జెండా, మరో చేత్తో అభివృద్ధి అజెండా పట్టుకొని భవిష్యత్తుకు భరోసా ఇస్తున్నటువంటి మన యువనేత, ప్రియతమ నేత నారా లోకేష్ కి, అదేవిధంగా పార్టీని బాధ్యతాయుతంగా ముందుకు నడిపిస్తున్నటువంటి పల్లా శ్రీనివాస్ కి, పసుపు పర్వ వేదిక, పసుపు సైన్యపు వేడుక అయిన ఈ మహానాడుకు విచ్చేసినటువంటి నాయకులకు, నిస్వార్థమైన కార్యకర్తలకు నమస్కారం.

ఈరోజు కడప గడపలో లక్షలాది మంది తెలుగు సైన్యం ఒక చోట కలుసుకుంటున్నారు అంటే, మాలాంటి వాళ్ళు ఎక్కడో ఉన్నా ఈరోజు రాష్ట్రానికి తిరిగి వచ్చి ప్రజాసేవ చేయాలి అని ముందుకు వస్తున్నాం అంటే, దానికి మొట్టమొదటి కారణం మరణం లేని మహానాయకులు, అకుంఠిత దీక్షలయినటువంటి అన్న నందమూరి తారక రామారావు. మరి ఒకసారి 2019 తర్వాత చూస్తే 2024 వరకు జరిగిన అరాచకం మీ అందరికి తెలుసు. ఎలక్షన్ల ముందు వచ్చినప్పుడు, ఎలక్షన్లు మూడు నాలుగు నెలల ముందు ఉన్నప్పుడు, నాకు ఎంతో మంది వందల మంది కార్యకర్తలు, నాయకులు మెసేజ్లు పెట్టేవాళ్ళు, ఫోన్లు చేసేవాళ్ళు. “సార్, మనం బిజెపితో పొత్తులో లేకపోతే అద్భుతంగా గెలుస్తాం. మీరు దయచేసి చంద్రబాబు నాయుడుకి చెప్పండి, పొత్తు వద్దు” అని. అయితే, ఆ రోజు చంద్రబాబు దగ్గరికి వెళ్లి నేను ఒకటే చెప్పాను. “సార్, తలలు పగిలినా, రక్తం చిందినా వెనకడుగు వేయని ధైర్యవంతులైనటువంటి కార్యకర్తలు, మాలాంటి నాయకులు మీ అందరికీ వెనకగా ఉంటాం. మీకు ఉన్నటువంటి అపారమైన అనుభవంతో మీకు నచ్చిన నిర్ణయం తీసుకోండి” అని చెప్పి వచ్చాను. ఆ రోజు ఆయన ఒక స్థిత ప్రజ్ఞతతో తీసుకున్నటువంటి ఒక నిర్ణయం వల్ల, వెంటిలేటర్ మీద ఉన్నటువంటి ఆంధ్రప్రదేశ్‌ను ఈరోజు ఆక్సిజన్ మీదకి తీసుకొచ్చారు. గత ఐదు సంవత్సరాల్లో జగన్మోహన్ రెడ్డి కి పూర్తి అధికారం ఉంది. కావాల్సినంత మంది ఎంపీలు ఉన్నారు, కావాల్సినంతటువంటి అవినీతి సొమ్ము ఉంది, ఆయనకు కొత్తో గొప్పో ధైర్యం ఉంది. అయినా కూడా ఏమి చేయలేకపోయారు. ఈరోజు చూస్తే తెలుగువాడు తలఎత్తుకునేలా, తెలుగు జాతి గర్వపడేలా, ప్రపంచమంతా మన వైపు చూసేలా అమరావతి నగరం అద్భుతంగా రూపుదిద్దుకోబోతుంది. గత ఐదు సంవత్సరాల్లో 14-19 మధ్య వచ్చిన రెండు యూనివర్సిటీలు అమెరికాలో కూడా అంత అద్భుతంగా లేవు అని మీరు చెబుతారు. రాబోయే అమరావతి మహానగరం చరిత్రలో ఒక మైలురాయిగా మిగిలిపోబోతుంది. అలాగే ఆగిపోయిన పోలవరాన్ని చంద్రబాబు ఎన్ని సార్లు ఢిల్లీకి వెళ్లారో, కేంద్ర మంత్రులతో ఎలా కలిసేవారో, ఎలా నెలల తరబడి ఫాలో అప్ చేస్తూ ముందుకు తీసుకెళ్లారో ప్రత్యక్షంగా చూశాను. విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో అర్ధరాత్రి వరకు కూర్చొని స్టీల్ మినిస్టర్స్‌తో, నిర్మలా సీతారామన్ తో మాట్లాడి పూర్తి చేసినటువంటి మహానుభావులు చంద్రబాబు. రాయలసీమ ప్రాంతంలో రూ.5000 కోట్లతో రెండు పారిశ్రామిక పార్కులు వస్తున్నాయి. పిపిసిఎల్ ద్వారా రూ.95వేల కోట్ల పెట్రో కెమికల్ కారిడార్ వస్తోంది. రైల్వే ప్రాజెక్టుల్లో కేవలం ఒక్క సంవత్సరంలోనే రూ.9000 కోట్ల ఖర్చు అవుతున్నాయి. గతంలో రూ.1000 కోట్లు కూడా రాలేదు. ఐదు సంవత్సరాల్లో రూ.50 వేల కోట్ల రూపాయల బడ్జెట్ వచ్చింది. ఇది ఒక్క చంద్రబాబు వ్యూహాత్మక ఆలోచన వల్లే సాధ్యమైంది. అమరావతిలో 230 ఫీట్ల వెడల్పుతో రోడ్డు కావాలని ముఖ్యమంత్రి అడిగారు. “ఇక్కడ జనం లేరు, ఎందుకు ఈ రహదారి?” అని కేంద్రం అడిగినప్పుడు, “నేను ఉండకపోయినా నా ప్రజలు అనుభవించాలి” అన్నారు. ఇది ఆయన భవిష్యత్ దృష్టి. జగన్మోహన్ రెడ్డి గత ఐదు సంవత్సరాల్లో 90 స్కీముల్లో 90 స్కీములు కూడా ఒక ఇన్స్టాల్మెంట్ తీసుకొని వాటికి స్టేట్ మ్యాచింగ్ ఇవ్వకుండా నాశనం చేశారు. 2014%-%19 మధ్యలో వేసిన సిమెంట్ రోడ్లే ఈరోజు బీసీ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఉపయోగపడుతున్నాయి. మళ్లీ అలాంటి అభివృద్ధిని తెచ్చేందుకు, ప్రతి నియోజకవర్గానికి రూ.20 కోట్ల రూపాయలతో పనులు జరుగుతున్నాయి. రూ.180 కోట్ల రూపాయలు రావాల్సిన నిధులు జగన్ పాలనలో ఆపబడ్డాయి. అవి తెచ్చే బాధ్యత మేము తీసుకుంటాం. అలాగే, జాతీయ ఉపాధి హామీ పథకంలో పెండింగ్ ఉన్న రూ.2000 కోట్ల రూపాయలు వచ్చే వారం వస్తాయి. ప్రతి ఇంటికి నీరు అందించాల్సిన జల జీవన్ మిషన్ స్కీమ్‌కు రూ.20 వేల కోట్ల బడ్జెట్ వచ్చింది. జగన్ కేవలం రూ.2000 కోట్లు ఖర్చు పెట్టి రూ.12 వేల కోట్లు నష్టం చేశారు. ఈ స్కీమ్ ఇప్పుడు ముగిసిపోతోంది. చంద్రబాబు మళ్లీ జలశక్తి మంత్రిత్వ శాఖతో మాట్లాడుతున్నారు, మళ్లీ ఐదేళు పొడిగించేందుకు. అదే విధంగా, చంద్రబాబు నాయకత్వంలోనే తిరిగి అభివృద్ధి, అజెండా పునఃప్రారంభం అవుతుంది. ఆయన దృష్టి, దార్శనికత వల్లే మన ఆంధ్రప్రదేశ్‌కు భవిష్యత్తు ఉంది”అని మాట్లాడారు.

# కలెక్టర్ ఆఫీస్‌లో ఘనంగా ఎన్టీఆర్ జయంతి





గుంటూరు, మే 28. ప్రజారక్ష. ప్రజలకు సంక్షేమ పథకాలు అమల్లోను, పాలనను ప్రజల ముంగిటకు తీసుకురావటానికి ప్రభుత్వ పరిపాలనలో విప్లవాత్మకమైన సంస్కరణలకు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు నాంది పలికారని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఏ. భార్గవ తేజ తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని ఎస్ ఆర్ శంకరన్ హాల్లో జరిగిన మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 102వ జయంతి వేడుకలలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డా. రాయపాటి శైలజ, శాసనమండలి సభ్యులు చంద్రగిరి ఏసురత్నం, నగరపాలక సంస్థ కమిషనరు పులి శ్రీనివాసులు పాల్గొన్నారు. నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ మాట్లాడుతూ,తెలుగు వారి అత్మగౌరవాన్ని జాతీయ, ప్రపంచస్థాయిలో నిలిపిన నందమూరి తారక రామారావు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించటం ఎంతో సంతోషకరం అన్నారు. నటుడుగా మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు పౌరణిక, జానపద, సాంఘీక చిత్రాలలో వైవిధ్య భరితమైన పాత్రలలో జీవించి నటనలో అయనకు అయనే సాటిగా నిలిచిపోయారన్నారు. ప్రజా సేవ చేయాలన్న లక్ష్యంతో పార్టీని స్థాపించిన తొమ్మిది నెలల అతి తక్కువ కాలంలోనే ఎన్నికలలో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి చరిత్రను సృష్టించారన్నారు. ముఖ్యమంత్రిగా ఆయన ప్రవేశ పెట్టిన రూ.2 కే కిలో బియ్యం పథకం పేదలకు అహార భద్రత పథకం క్రింద తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ వ్యాప్తంగా అన్నిరాష్ట్రాల్లోని అమలు జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాలనను ప్రజల వద్దకు తీసుకురావటానికి మండల వ్యవస్థకు తీసుకువచ్చరన్నారు. ఎన్టీఆర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని వ్యక్తిగత, ఉద్యోగ జీవితంలో బాధ్యతలు నిర్వహించాలన్నారు.

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డా. రాయపాటి శైలజ మాట్లాడుతూ, ఎన్టీఆర్ సినీ రాజకీయ రంగ ప్రయాణం అందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని కాపాడటానికి తెలుగు దేశం పార్టీని స్థాపించి తొమ్మిది నెలల్లోనే అధికారం చేపట్టి ముఖ్యమంత్రి అయ్యారన్నారు. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అని పరిపాలన సాగించి ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. సినీ రంగంలో ఒక సంచలనాన్ని, రాజకీయ రంగంలో ప్రభంజనాన్ని సృష్టించారన్నారు.

ఢిల్లీ స్థాయిలో తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలపటంతో పాటు ప్రాంతీయ పార్టీలకు ప్రత్యేక స్థానం తీసుకువచ్చారన్నారు. పేదలకు రూ.2కిలో బియ్యం, పక్కా గృహాలు, స్థలాలు కేటాయింపు వంటి పదకాలకు తొలిసారిగా నాంది పలికారన్నారు. మహిళలకు ఆస్థి హక్కు కల్పించటంతో పాటు, పంచాయితీ రాజ్ లో మూడవ వంతు రిజర్వేషన్ కల్పించారన్నారు. పాలన వికేంద్రీకరణలో భాగంగా మండల వ్యవస్థకు శ్రీకారం చుట్టారన్నారు. దేవాదాయశాఖలో ముఖ్యంగా తిరుమల తిరుపతి దేవస్థానానికి ప్రాముఖ్యత తీసుకువచ్చేలా అటవీ చట్టంలో సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. ఎన్టీఆర్ బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి చేసిన సేవలకు తెలుగుజాతి ఉన్నంత కాలం ప్రజల గుండెల్లో జీవించి ఉంటారన్నారు. శాసన మండలి సభ్యులు చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ, ఎన్టీఆర్ పేదల సంక్షేమానికి చరిత్రలో నిలిచిపోయే పథకాలను ప్రవేశపెట్టిన గొప్ప మానవతవాది అన్నారు. ఎన్టీఆర్ కు అంగరక్షకుడుగా విధులు నిర్వహించటం నా జీవితానికి అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఆయన క్రమశిక్షణ, జీవిత విధానంతో ఎంతో స్ఫూర్తి పొందామన్నారు. ఎన్టీఆర్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహిస్తున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కి, ఉప ముఖ్యమంత్రి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. నగరపాలక సంస్థ కమిషనరు పులి శ్రీనివాసులు మాట్లాడుతూ, ఎన్టీఆర్ రూ.2 కిలో బియ్యం వంటి పథకాలను అమలు చేసి దేశ వ్యాప్తంగా సంక్షేమ కార్యక్రమాలకు పునాది వేశారన్నారు. మనసబు, కరణం వ్యవస్థలను రద్దు చేసి రెవెన్యూ వ్యవస్థలో విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. పరిపాలనలో తీసుకువచ్చిన అనేక సంస్కరణలు వలన సంక్షేమ పథకాల అమలుకు దోహదపడ్డారన్నారు. రాష్ట్ర సచివాలయంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించటం ద్వారా ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనను దగ్గరగా చూసే అవకాశం కలిగిందన్నారు. సభలో చిన్నారులు ఆలపించిన దేశభక్తి, జానపద గీతాలు అలరించాయి. నందమూరి తారక రామారావు చిత్రాలతో కూడిన ఫోటో ప్రదర్శనను తిలకించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజా వలి, స్టెప్ సీఈఓ చంద్రముని, మెప్మా పీడీ విజయలక్ష్మి, ఆర్డీవో శ్రీనివాసులు, నగరపాలక సంస్థ కార్పోరేటర్లు స్మిత పద్మజ, వెంకట రమణ, చిష్తీ, మీరావలి, కలెక్టరేట్ ఏవో పూర్ణ చంద్రరావు, జిల్లా అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# గుంటూరులో ఘనంగా ఎన్టీఆర్ జయంతి





గుంటూరు, మే 28. ప్రజారక్ష. అరండల్ పేట టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతి : అరండల్ పేటలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం స్వామి వివేకానంద యోగా క్లాస్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. యోగా నిత్య సాధకుడు శ్రీకర్, యోగా గురువు ఆళ్ల రాజేశ్వరరావు కేక్ కట్ చేసి, ఎన్టీఆర్ విగ్రహానికి గజమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**ఎన్టీఆర్ కు గుంటూరు జిల్లాలో అనుబంధం ఉంది : ఎస్పీ.**

తెలుగు వారి ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని గుంటూరు జిల్లా ఎస్పీ సతీశ్ కుమార్ అన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ కు గుంటూరు జిల్లాతో మంచి అనుబంధం ఉందని గుర్తు చేశారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమలో ఆయన ప్రత్యేక స్థానం పొందారన్నారు.

**జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిపారు.**

డిఎంహెచ్వో ఆఫీసులో ఎన్టీఆర్ 13వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ కే. విజయలక్ష్మి, లక్ష్మీ కుమారి, డా. ప్రియాంక, ఏ. జయ ప్రసాద్, భక్తవత్సలం, ఆనందరావు, వెంకటేశ్వర్లు,శేషగిరి రాజు, సైమన్, రాజు నాయక్,మరియు సిబ్బంది పాల్గొన్నారు.

**జీఎంసీలో :**

నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం మందిరంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు సందర్భంగా ఆయన చిత్రపటానికి వివిధ డివిజన్లకు కార్పొరేటర్లు అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు, డిప్యూటీ కమిషనర్లు డి. శ్రీనివాసరావు, సిహెచ్. శ్రీనివాస్, టి. వెంకట కృష్ణయ్య,డా.అమృతం, సిటీ ప్లానర్ రాంబాబు మొదలైన వారు పాల్గొన్నారు.

# వెలగని విద్యుత్ దీపాలు

కుప్పం మే 28/ ప్రజారక్ష చిత్తూరు జిల్లా కుప్పం మున్సిపాలిటీ మూడో వార్డు బైరుగానిపల్లి గత కొంతకాలంగా విద్యుత్ దీపాలు సరిగ్గా పనిచేయకపోవడంతో స్థానిక ప్రజలు నడక రాకపోకలకు గాను ప్రజలు బిక్కుబిక్కుమంటూ వెళ్ళవలసి వస్తుంది రోజులు నెలలు గడిచిన మున్సిపాలిటీలో కుప్పం బైపాస్ బైరుగానిపల్లి నుండి ప్రభుత్వ ఆసుపత్రి వరకు మధ్యలో లింకు రోడ్లు జల్లప్ప కొట్టాలు పోవు రోడ్డు విద్యుత్ దీపాలు స్తంభాల కొన్నిచోట్లకి అవసరమైనప్పటికీ ఇప్పటికీ మరమ్మతులు చేపట్టకపోవడంతో అక్కడక్కడ తప్ప మిగతా చోటంత చీకటిమయం కనబడుతుందని అటుగావస్తూపోతున్నటువంటి ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు సాక్షాత్తు ముఖ్యమంత్రి వర్యులు ప్రాతినిత్యం వహిస్తున్న నియోజకవర్గంలో ముఖ్యంగా కుప్పం మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ దీపాలు వెలగకపోవడం వాటిని గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలందరికీ సౌకర్యార్థం ఏర్పాటు చేయవలసిందిగా స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

# సాంస్కృతిక కార్యక్రమాలలో చిన్నారులు..

**– ఎన్టీఆర్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న జాయింట్ కలెక్టర్ తదితరులు**

**– రాజకీయాలలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టిన ఎన్టీఆర్... జాయింట్ కలెక్టర్...**





నరసరావుపేట రూరల్, మే 28, (ప్రజా రక్ష) మహనీయుల జయంతి వేడుకలు నిర్వహించుకోవడం వారికి ఇచ్చిన గొప్ప గౌరవం అని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం నందమూరి తారక రామారావు 102 వ జయంతి వేడుకలు రాష్ట్ర పండుగగా ఘనంగా నిర్వహించారు. తొలుత మా తెలుగు తల్లి పాటతో మొదలు పెట్టి నందమూరి తారక రామారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించిన అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాతుతూ మహనీయుల జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకుని జీవితంలో పాఠాలుగా నేర్చుకోవాలన్నారు. పాలనలో ఎన్నో మార్పులు చేశారని తద్వారా ఇప్పుడు లబ్ధి చేకూరుతున్నాయన్నారు. మండల వ్యవస్థను ప్రవేశ పెట్టి అధికారుల పరిధి ఎక్కువగా ఉండేది దానిని డీ- సెంట్ర లైజేషన్ చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. వృద్ధులకు, వికలాంగులుకు, వితతుంతువులకు పింఛన్ అవకాశం కల్పించారన్నారు. పేదలకి రూ 2/- లకు కిలో బియ్యం పథకం ప్రవేశ పెట్టారన్నారు. పరిపాలనా మార్పులవల్ల ప్రజలతో అధికారులకు అనుసంధానం ఏర్పడిందన్నారు. జిల్లా రెవిన్యూ అధికారి మురళి మాట్లాడుతూ ఎన్టీఆర్ సానుకూల దృక్పథం కలిగిన వ్యక్తి అని ఒక సందర్భంలో ఆయన్ను కలిసినప్పుడు అర్థం అయిందన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో ఎపిఎంఐపి అధికారి ఆంజనేయులు, డిప్యూటి కలెక్టర్ కుమార్, ఆర్డీఓ కె.మధులత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సిఎం చంద్రబాబుతో .... ఎమ్మెల్యే అరవింద బాబు

**– మహానాడులో సిఎం చంద్రబాబు తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవింద బాబు**





నరసరావుపేట రూరల్, మే 28, (ప్రజా రక్ష) వైఎస్ఆర్ కడప జిల్లాలో తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహానాడు కార్యక్రమం నవ్వుతూ అన్న రీతిలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నాను. మూడు రోజులపాటు జరగనున్న మహానాడు వేడుకలు రెండు రోజైనా బుధవారం సభా వేదికపై నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో మాట్లాడారు. పలు అంశాలపై ఆయనతో చర్చించారు. నరసరావుపేట మండలం వైస్ ఎంపీపీ పదవిని టీడీపీ కైవసం చేసుకున్న విషయాన్ని సీఎం చంద్రబాబుకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చదలవాడను, ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. మహానాడు వేడుకకు నరసరావుపేట నియోజకవర్గం నుంచి వేలాదిమంది టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొనడం జరిగింది.

# రాష్ట్రంలోని అన్ని గిరిజన ప్రాంతాల్లో వైసిపి గెలుస్తుంది

**– మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి**




నరసరావుపేట రూరల్, మే 28, (ప్రజా రక్ష) రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని గిరిజన ప్రాంతాల్లో వైసీపీ విజయ బావుటా ఎగురవేస్తుందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో నరసరావుపేట నియోజకవర్గ వైసీపీ ఎస్టీ విభాగం నూతన అధ్యక్షునిగా నియమించబడ్డ మొగిలి ఆంజనేయులు బుధవారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి దుశ్యాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ యువకుడు, ఉత్సాహవంతుడు అందర్నీ కలుపుకొని పోయే మనస్తత్వం ఉన్న మొగిలి ఆంజనేయులుకి ఎస్టీ విభాగం అధ్యక్షులుగా నియమించడం చాలా ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వంలో గిరిజనుల కోసం అనేక మంచి కార్యక్రమాలు చేశామని, పాడేరులో గిరిజన యూనివర్సిటీని మరియు మెడికల్ కాలేజీని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, మద్దిరెడ్డి నరసింహారెడ్డి, షేక్. కరిముల్లా, గంటనపాటి గ్యాబ్రియల్, వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా జరిగిన నందమూరి తారక రామారావు 102 వ జయంతి వేడుకలు



నిజాంపట్నం మే 28 ప్రజా రక్ష మండల కేంద్రమైన నిజాంపట్నం లో బుధవారం నిజాంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎన్ నాగలక్ష్మి అధ్యక్షతన ఆంధ్రుల ఆత్మ గౌరవాన్ని దేశ మొత్తం దశదిశలా వ్యాపింప చేసిన మహోన్నత వ్యక్తి ఆంధ్రులకు ఒక స్థానాన్ని ఏర్పాటుచేసి చలన చిత్ర పరిశ్రమలోమహోన్నత స్థాయిలో ఎదిగిన ఆంధ్రులకు ప్రత్యక్ష దైవముగా నిలిచిన రాజకీయాలలో కూడా తనకంటూ ఒక స్థానాన్ని సుస్థిరపరచుకొని ఆంధ్రులను దేశములోనే ఒక స్థానం కల్పించిన ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 102 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో యం రవిశంకర్ , పంచాయతీ కార్యదర్శి మోడీ శ్రీనివాసరావు , జూనియర్ అసిస్టెంట్ రామకృష్ణ , టి జాఫర్ , ఎంపీటీసీ సభ్యులు నాజర్ ఖాన్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## చింతిరాల వివాహ వేడుకలో పాల్గొన్న గోపిరెడ్డి



నరసరావుపేట రూరల్, మే 28, (ప్రజా రక్ష) మండలంలోని ములకలూరు గ్రామంలో బుధవారం జరిగిన చింతిరాల ప్రభుదాసు, మేరీల కుమారుడు డేవిడ్ రాజు వివాహ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కొల్లా హరి నారాయణ, పొదిలి ఖాజా, నయాబ్ మాబు సుభాని, మరియు గ్రామ వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలుగువారి హాస్య జ్యోతి నందమూరి తారక రామారావు



నిజాంపట్నం మే 28 ప్రజా రక్ష తెలుగువారి ఆత్మ గౌరవాన్ని దశదిశల చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగువారి హాస్య జ్యోతి తెలుగువారి స్థానాన్ని దేశంలో ఒక స్థాయిలో నిలబెట్టిన మహోన్నతుడు అని మాజీ మంత్రి, మాజీ రాజ్యసభ సభ్యులు, టిడిపి నాయకులు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమంలో మాజీ ఎంపీ మోపిదేవి పాల్గొన్నారు. వేదిక పైన టిడిపి ముఖ్య నాయకులతో కలిసి ఆసీనులయ్యారు. తెలుగువారి ఆత్మగౌరవం నినాదంతో తెలుగుదేశం పార్టీని స్థాపించిన నందమూరి తారకరామారావు అనతి కాలంలోనే దేశవ్యాప్తంగా తెలుగు వారికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని అన్నారు.

## టిడ్కో గృహ సముదాయాల వద్ద పార్కు నిర్మాణానికి కమీషనర్ భూమి పూజ.



మంగళగిరి ప్రజారక్ష మే 28 మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ ప్రజలకు మరో ఆరు నెలల్లో అద్భుతమైన పార్కు అందుబాటులోకి రానుందని కమిషనర్ హలీం భాష తెలిపారు. మంత్రి స్థానిక శాసనసభ్యులు నారా లోకేష్ ఆదేశాల సూచనల మేరకు అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో టిడ్కో గృహ సముదాయాల వద్ద నూతనంగా నిర్మించిన పార్కుకు బుధవారం భూమి పూజ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ అలీమ్ భాష మాట్లాడుతూ, రాష్ట్రమంత్రి స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ సూచనల మేరకు నగర పాలక సంస్థకు చెందిన మూడు ఎకరాలు ఏపీఐఐసీకి చెందిన మరో మూడు ఎకరాలు మొత్తం ఆరు ఎకరాల విస్తీర్ణంలో పార్కు నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. రూ 9 కోట్ల వ్యయంతో ఈ పార్కును నిర్మించనున్నట్లు చెప్పారు. అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ దీని నిర్మాణాన్ని చేపడుతోందని ఫిబ్రవరి నాటికి ఇది సిద్ధమై ప్రజలకు అందుబాటులోకి రానుందని తెలిపారు. అడిషనల్ కమిషనర్ శకుంతల మాట్లాడుతూ, ఇప్పటికే శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కాలనీలో పార్కు నిర్మాణం చేపట్టడం జరిగిందని చేపట్టటం జరిగిందని తెలిపారు. నగరం అభివృద్ధి చెందుతున్నప్పటికీ సరైన పార్కులు లేవని అన్నారు. ఈ కొరతను తీర్చేందుకు మంత్రి నారా లోకేష్ సూచనలతో టిడ్కో గృహాల వద్ద ఆరు ఎకరాల విస్తీర్ణంలో పార్కు నిర్మాణం జరగబోతుందని అన్నారు. అపార్ట్మెంట్ కల్చర్ కు ప్రజలు అలవాటు పడుతున్న నేపథ్యంలో ఈ పార్కు వలన బ్రీతింగ్ సమస్యలు తీరుతాయని, ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడుతుందని చెప్పారు. నూతనంగా నిర్మితం కాబోయే పార్కు ఈ ప్రాంత ప్రజలకు ఓ వరం లాంటిదని అన్నారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో టిటిడి బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకి దేవి, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం మున్సిపల్ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతి



కుప్పం మే 28 ప్రజారక్ష కుప్ప మున్సిపల్ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కమిషనర్ శ్రీనివాసరావు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఎన్టీఆర్ కు దక్కుతుందని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## అక్షితకు నాట్య మయూరి అవార్డు



మంగళగిరి ప్రజారక్ష మే 28 కూచిపూడి నృత్యంలో అద్భుత ప్రదర్శన ఇచ్చిన మంగళగిరికి చెందిన మునగాల గేయ అక్షితకు నాట్య మయూరి అవార్డు లభించింది. పాతమంగళగిరికి చెందిన మునగాల మురళీకృష్ణ, మౌనిక దంపతుల కుమార్తె అక్షిత స్థానిక సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్లో 9వ తరగతి చదువుతుంది. విజయవాడలో శ్రీ వాగ్దేవి కూచిపూడి నృత్యాలయంలో సప్పా శివకుమార్ వద్ద అక్షిత శాస్త్రీయ నృత్యంలో శిక్షణ పొందుతుంది. గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో కళానిలయం ఆధ్వర్యాన ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి 40వ శాస్త్రీయ, పాశ్చాత్య సంగీత, నృత్య పోటీల్లో పాల్గొన్న అక్షిత కూచిపూడి-ఏ గ్రూపులో భామా కలాపం నృత్య ప్రదర్శనకు గాను ప్రథమ బహుమతిని సాధించింది. కళా నిలయం ఆధ్వర్యంలో అక్షితకు మంగళవారం నాట్య మయూరి అవార్డును ప్రదానం చేశారు. కూచిపూడిలో అద్భుత ప్రతిభ కనబర్చిన అక్షితను పలువురు ప్రముఖులు అభినందించారు.

## అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి : జిఎంసి కమిషనర్



గుంటూరు, మే 28. ప్రజారక్ష. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని పార్క్ ల్లో వాకింగ్ ట్రాక్ లు, ఓపెన్ జిమ్ ఎక్విప్మెంట్ లను ఎప్పటికప్పుడు చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు.

బుధవారం కమిషనర్ ఆర్టీసి కాలనీ పార్క్, కాకాణి రోడ్, సీతా నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలోని పార్క్ ల్లో నూతనంగా చేట్టాల్సిన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్దం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆర్టీసి కాలని పార్క్ లో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఎక్విప్మెంట్ ల మరమత్తు పనులు చేపట్టాలని ఏఈని ఆదేశించారు. పార్క్ ల్లో పచ్చదనం పెంపుకు ఉద్యానవన విభాగ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వర్షాలకు పార్క్ ల వాకింగ్ ట్రాక్ లలో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించి, నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ చేయడం ద్వారా ప్రధాన ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్స్ లేకుండా చేయవచ్చని, అందుకు పిన్ పాయింట్ గా పారిశుధ్య పనులు జరిగేందుకు సచివాలయం పరిధిలో కార్మికుల హాజరు, పనితీరు, పారిశుధ్యం పూర్తిగా శానిటేషన్ కార్యదర్శే భాధ్యత వహించాలన్నారు. డ్రైన్లు శుభ్రం చేయడం లేదని ప్రజల నుండి ఫిర్యాదులు అందుతున్నాయని, ఇన్స్పెక్టర్లు, ఎస్ఎస్ లు మధ్యాహ్నం సమయంలో కార్మికులు డ్రైన్లు శుభ్రం చేసేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అవుట్ ఫాల్ డ్రైన్ల తీసిన పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నోడల్ అధికారులు కూడా ప్రతి రోజు పారిశుధ్య పనులను పర్యవేక్షణ చేసి, లోపాలు ఉన్న ప్రాంతాల్లో నివేదిక ఇవ్వాలన్నారు.

ఈ పర్యటనలో కార్పొరేటర్ కె.రంగారెడ్డి, ఎస్ఎస్ ఆయుబ్ ఖాన్, ఆర్ఓ సాదిక్ బాష, టిపిఎస్ లు, ఆర్ఐలు, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మతి స్థిమితం లేని బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగింత



గుంటూరు, మే 28. ప్రజారక్ష. గుంటూరు జిల్లా మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం (ఏంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్) పోలీసులు మతిస్థిమితం లేని బాలుడిని కుటుంబ సభ్యులకు బుధవారం అప్పగించారు. 2022 నవంబర్ నెలలో పొన్నూరు బస్ స్టాండ్ వద్ద మతి స్థిమితం లేని నవనాద్ గంగారం షిండే, సుమారు 15 సంవత్సరాల పిల్లవాడిని గుర్తించి, అతని సంరక్షణార్థం గుంటూరు నగరంలోని కార్మెల్ హోమ్ నందు గుంటూరు జిల్లా మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం మహిళా ఏఎస్సై బేబీ రాణి మరియు సిబ్బంది చేర్పించారు. మతి స్థిమితం లేని అబ్బాయి బాగోగులు చూస్తూ అతనిని వారి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చడానికి కార్మెల్ హోమ్ ఇంచార్జి వీరశంకర్, వారితో పాటు మహిళా ఏఎస్సై బేబి రాణి గత రెండు సంవత్సరాలుగా ఎన్నో ప్రయత్నాలు చేశారు. చివరకు అతని వేలిముద్రల ఆధారంగా ఆధార్ కార్డును,దాని ద్వారా అతని చిరునామాను కనిపెట్టారు. మహారాష్ట్ర రాష్ట్రంలోని థానే జిల్లాలోని తిలక్ నగర్ లోని వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బుధవారం అతని సోదరుడైన వైభవ్ గంగారం షిండేకి మతి స్థిమితం లేని అబ్బాయి అయిన నవనాథ గంగారం షిండేని అప్పగించారు. ఇన్ని రోజులు మతి స్థిమితం లేని అబ్బాయి బాగోగులు చూసిన కార్మెల్ హోమ్ ఇంచార్జి వీర శంకర్ మరియు వారి సిబ్బందిని, బాలుడిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించడంలో కృషి చేసిన గుంటూరు జిల్లా మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం మహిళా ఏఎస్సై బేబీ రాణి ని మరియు సిబ్బందిని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అభినందించారు.

## మహానాడు రాష్ట్ర భవితకు దిశానిర్దేశం : ఎమ్మెల్యే నసీర్



గుంటూరు, మే 28. ప్రజారక్ష. రాష్ట్ర భవితకు మహానాడు దిశా నిర్దేశంగా మారిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. కడపలో జరిగిన మహానాడులో పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్ బుధవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. దేశ చరిత్రలోనే మహానాడు ఒక గొప్ప అధ్యాయంగా మిగిలిపోయేలా నిర్వహించామని తెలిపారు.

స్వర్గీయ అన్న నందమూరి తారకరామారావు ఆశయాలను సీఎం చంద్రబాబు నాయుడు కొనసాగిస్తున్నారని, వారి ఆధ్వర్యంలో గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. మహానాడులో ఆమోదించిన తీర్మానాలు ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును మరింత ముందుకు తీసుకెళ్లే విధంగా ఉన్నాయని చెప్పారు ముస్లిం మైనారిటీల స్థితిగతులు, వారి జీవన పరిస్థితుల మార్పునకు నందమూరి తారక రామారావు బాటలు వేస్తే సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఆర్థిక ప్రగతి వైపు నడిపిస్తున్నారని తెలిపారు.

మరణం లేని మహనీయులు ఎన్టీఆర్ :

ఎమ్మెల్యే నసీర్ ఆదేశాల మేరకు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయం, బస్టాండ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన నివాళులర్పించారు. ఎన్టీఆర్ మరణం లేని మహనీయులని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజా మాస్టర్, శనక్కాయల ఉమా శంకర్, కార్పొరేటర్స్ మీరావాలి, పోతురాజు సమత,చిష్టి, ఆయేశెట్టి శ్రీనివాస్, వేముల శ్రీనివాస్, వేల్చూరి కిరణ్, రబ్బాని మల్లంపూడి శ్రీనివాస్, ఎర్ర గోపి నాగేశ్వరావు, జానీ, హుస్సేన్, బత్తిన శంకర్, వీరారెడ్డి, అరవపల్లి శ్రీను, మొవ్వ శైలజ, విజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## సినిమా థియేటర్లపై నిరంతరం నిఘా పెట్టండి :ఆళ్ళ హరి



గుంటూరు, మే 28. ప్రజారక్ష. వినోదం పంచాల్సిన సినిమా హాళ్ళ నిర్వహణపై ప్రజల నుంచి పెద్దఎత్తున వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో సంభంధిత అధికార యంత్రాంగం సినిమా హాళ్ళ పై నిరంతరం నిఘా పెట్టాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ్ ను జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో భార్గవ్ తేజ్ ని కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ, ఇష్టానురీతిగా టికెట్ ధరలు పెంచటంపై ఉన్న శ్రద్ధ ప్రేక్షకులకు సదుపాయాలు కల్పించటంపై హాళ్ళ యాజమాన్యానికి లేదని విమర్శించారు. కొన్ని హాళ్ళల్లో కనీసం మంచినీటి సదుపాయం కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక హాళ్ళలో తినుబండారాలు, పాప్ కార్న్ , శీతలపానియాల ధరలు దారుణాతిదారుణంగా ఉన్నాయన్నారు. వాటిని యం ఆర్ పీ కన్నా 60నుంచి 80శాతం అధిక ధరలకు అమ్ముతూ ప్రేక్షకులు సినిమాకి రావాలంటేనే భయపడేలా చేస్తున్నారని ధ్వజమెత్తారు. మరికొన్ని హాళ్ళలో అనుకోని ప్రమాదం జరిగితే బయటికి వచ్చేందుకు అత్యవసర ద్వారాలు కూడా సరిగ్గా లేవన్నారు. మరికొన్ని హాళ్ళు అగ్ని మాపక శాఖ నిభంధనలను కూడా పట్టించుకోవటం లేదని , ప్రేక్షకుల భద్రత గాల్లో దీపంలా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల నుంచి ఇబ్బడిముబ్బడిగా వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో నిభందనలు పాటించని సినిమా హాళ్ళ యాజమాన్యంపై కఠినచర్యలకు సైతం వెనుకాడవద్దని జేసీ భార్గవ్ తేజ్ ని ఈ సందర్భంగా ఆళ్ళ హరి కోరారు.

## నేరాల నియంత్రణే ధ్యేయంగా పోలీసులు కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు

**– రూరల్ సిఐ పి.రామకృష్ణ**



నరసరావుపేట రూరల్, మే 28, (ప్రజా రక్ష) పల్నాడు జిల్లాలో నేరాలు నివారించి ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ప్రతి గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించనున్నట్లు రూరల్ సిఐ పి.రామకృష్ణ అన్నారు. ఈ మేరకు బుధవారం నరసరావుపేట మండలంలోని పమిడిమర్రు గ్రామంలో బుధవారం కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రామకృష్ణ మాట్లాడుతూ

జిల్లా ఎస్.పి కె.శ్రీనివాసరావు, నరసరావుపేట డి.ఎస్.పి కె.నాగేశ్వరరావు ఆదేశాల మేరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించామన్నారు. నరసరావు పేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ చర్యలలో భాగంగా సంఘ వ్యతిరేక శక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు, సామాన్య ప్రజలకు ఇబ్బందులకు గురి చేసే వారిని గుర్తించి ప్రజలకు భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. పమిడిమర్రు గ్రామంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలలో భాగంగా తనిఖీలు చేపట్టామన్నారు. రౌడీషీటర్లు, పాత కేసుల్లోని నిందితులపై ప్రత్యేక నిఘా ఉంచడంలో భాగంగా ఇళ్లు, పశువుల పాకలు, గడ్డి వాము ప్రాంతాలు, దుకాణాలు, బడ్డీ కొట్లలో క్షుణ్ణంగా తనిఖీలు కొనసాగించారు. తనిఖీలలో ధ్రువీకరణ పత్రాలు లేని 63 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు, గొడ్డళ్లు, కర్రలు, పార స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో నాటు సారా, గుట్కా వినియోగం వలన కలిగే అనర్థాలు వివరించారు. అక్రమ మద్యం జోలికి వెళితే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. పాత పంథా కొనసాగించకుండా సత్ప్రవర్తనతో మెలగాలని పాత నేరస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో 1వ ,2వ పట్టణ సిఐ లు ఎంవి చరణ్, పి.హైమారావు, ట్రాఫిక్ సిఐ లోకనాథం, రూరల్ ఎస్.ఐ కిషోర్, 1వ,2వ పట్టణ ఎస్.ఐ లు వంశీకృష్ణ, అశోక్, చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ అనిల్, రొంపిచర్ల ఎస్.ఐ మణి కృష్ణ, ఏ.ఎన్.ఎస్

ఆర్.ఐ యువ రాజ్, ఏ.ఎన్.ఎస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## జూన్ 2న మండల కార్యాలయాల వద్ద ఇళ్ల స్థలాల కొరకు ధర్నా

**ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం పట్టణాలలో రెండు, సెంట్లు గ్రామాలలో మూడు సెంట్లు, ఇచ్చి ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షల కాకుండా ఐదు లక్షలు ఇవ్వాలి**



మంగళగిరి ప్రజారక్ష మే 28 జూన్ రెండవ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా పట్నాల్లో రెండు సెంట్లు గ్రామాలలో మూడు గంటలు ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు కట్టుకోవడానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో మంగళగిరి మండల కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ లు తెలియజేశారు. ఈ సందర్భంగా బుధవారం మంగళగిరి పట్టణంలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్ సిపిఐ పార్టీ కార్యాలయంలో గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్లు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గం లో జిల్లా నిర్మాణం చేసుకొని గత దశాబ్దాలుగా ఉంటున్న వారికి మంత్రి స్థానిక శాసనసభ్యులు నారా లోకేష్ ఇళ్ల పట్టాలి ఇవ్వడం సంతోషదాయకమని వారు అన్నారు. అదేవిధంగా ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసిన కూటమి ప్రభుత్వం ఎన్నికల తర్వాత వాగ్దానాలను నెరవేర్చడం లేదని వారు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామాలలో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు కట్టుకోవడానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అందులో భాగంగానే జూన్ రెండవ తారీఖున మండల కార్యాలయ వద్ద ఇళ్ల స్థలాల కొరకు ధర్నా కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కేవలం పెన్షన్ విధానాన్ని మాత్రమే అమలు జరుపుకున్నారని వారు అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఇళ్ల స్థలాల లబ్ధిదారుల అభ్యులను సచివాలయాల వద్ద స్థానిక మున్సిపల్ కార్యాలయాల వద్ద మండల కార్యాలయాల వద్ద ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేని పక్షంలో పేద బడుగు బలహీన వర్గాల కదుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్లు అన్నారు. ఈ గోడ ప్రతులు ఆవిష్కరణ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, బాపనపల్లి వెంకటేశ్వరరావు, గండికోట దుర్గారావు, వల్లభాపురం నాగేశ్వరరావు, నందం చిన్న, ఆకురాతి శ్రీనివాసరావు, మల్లూరి వాసు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబును కలిసిన కోడెల శివరాం

**– మహానాడులో సందడి చేసిన డాక్టర్ కోడెల శివరాం**



నరసరావుపేట రూరల్, మే 28, (ప్రజా రక్ష) తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో వైయస్సార్ కడప జిల్లాలో ఎంతో ప్రతిష్టాత్మకంగా మహానాడు పండుగను చేపట్టింది. మూడు రోజులపాటు జరగనున్న మహానాడు వేడుకలో రెండోవ రోజైన బుధవారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి కాసేపు ముచ్చటించారు.

## పోలీసు విచారణకు హాజరైన సజ్జల భార్గవరెడ్డి

**పవన్, లోకేశ్ లపై అనుచిత వ్యాఖ్యల కేసు మంగళగిరి రూరల్ పీఎస్ కు వచ్చిన భార్గవ్**



మంగళగిరి ప్రజారక్ష మే 28 డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పై అనుచిత వ్యాఖ్యల కేసులో వైసీపీ సోషల్ మీడియా ఇన్చార్జ్ సజ్జల భార్గవరెడ్డి విచారణకు హాజరయ్యారు. మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ కు ఆయన వచ్చారు. కేసు విచారణకు సంబంధించి బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరు కావాలని పోలీసులు నోటీసులు ఇచ్చారు. అయితే ఆయన పోలీసులు రమ్మన్న సమయం కంటే ముందుగానే పోలీస్ స్టేషన్ కు చేరుకున్నారు. ప్రస్తుతం భార్గవ్ ను పోలీసులు ప్రశ్నిస్తున్నారు. వైసీపీ సోషల్ మీడియాలో పవన్ కళ్యాణ్ నారా లోకేష్ పై అభ్యంతరకరమైన పోస్టులపై సజ్జల భార్గవ్ రెడ్డి పై కేసు నమోదు కాగా కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు విచారణకు హాజరు కావాలని గుంటూరు జిల్లా మంగళగిరి రూరల్ పోలీసులు నోటీసులు జారీ చేయగా ఈరోజు సజ్జల భార్గవ్ రెడ్డి పోలీస్ స్టేషన్లో హాజరయ్యారు విచారణ అనంతరం మంగళగిరి రూరల్ సిఐ వై శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ 2023 నవంబర్ నెలలో వైయస్సార్సీపి సోషల్ మీడియాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్ ప్రముఖ సినీ నటులపై అభ్యంతరకరమైన పోస్టులు పెట్టిన కారణంగా కోర్టు ఆదేశాలతో సజ్జల భార్గవ రెడ్డి ని విచారించడం జరిగిందన్నారు. వైసీపీ సోషల్ మీడియా స్టేట్ కన్వీనర్ జిల్లా కోఆర్డినేటర్ అయినా సజ్జల భార్గవ్ రెడ్డి కడప జిల్లాకు చెందిన పర్వతనేని సుధాకర్ ప్రధాన సూత్రధారులని చెప్పారు. మా వద్ద ఉన్న సమాచారం మేరకు సజ్జల భార్గవరెడ్డిని విచారించగా కొంత అనుకూలంగా కొంత వ్యతిరేకంగా సమాచారం ఉందని తెలియజేశారు. ఇంకా కొన్ని సందేహాలు ఉన్నాయని వాటిపై విచారణకు మరోసారి నోటీసులు జారీ చేయడం జరుగుతుందని చెప్పారు. ఇప్పటి వరకు రాబట్టిన సమాచారాన్ని ఫైల్ చేసి కోర్టులో హాజరు పరుస్తామని సీఐ శ్రీనివాసరావు తెలియజేశారు.

## ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఘన నివాళి.. - జిల్లా ఎస్పీ తుషార్ డూ డీ



బాపట్ల,మే 28(ప్రజారక్ష):క్రమశిక్షణ, కృషికి ఎన్టీఆర్ జీవితం దర్పణమని జిల్లా ఎస్పీ తుషార్ దూడి ఐపీఎస్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, తెలుగు సినిమా మహానటుడు, ప్రజల మనసు గెలుచుకున్న పద్మశ్రీ, కళాప్రపూర్ణ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా బుధవారం జిల్లా ఎస్పీ స్థానిక పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి, ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ తెలుగు ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తిత్వం నందమూరి తారక రామారావు ఒక గొప్ప నటుడిగానే కాక, రాజకీయాల్లో ప్రవేశించి సామాన్య ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన ప్రజానాయకుడన్నారు. ఎన్నో విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టి, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ఆయన క్రమశిక్షణ, కృషి, సమాజం పట్ల ఉన్న బాధ్యత మనందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. ఒక వ్యక్తి తన కృషితో సమాజంపై ఎంత ప్రభావం చూపగలడో ఆయన జీవితం తేటతెల్లంగా చూపిందన్నారు. అలాంటి గొప్ప వ్యక్తుల స్ఫూర్తితో పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది సమాజం పట్ల అంకితభావంతో, క్రమశిక్షణతో తమ బాధ్యతలు నిర్వర్తించాలన్నారు. నేటి యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని, కృషి, పట్టుదలతో తమ లక్ష్యాలను చేరుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, సిఐ కె.శ్రీనివాసరావు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తెలుగువారి ఆరాధ్య దైవం ఎన్టీఆర్.



రామకుప్పం మే 20,(ప్రజా రక్ష ప్రతినిధి) రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి కూడు, నీడ,గుడ్డ కల్పించాలన్న సంకల్పంతో మరియు తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడడం కోసం నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి కేవలం తొమ్మిది నెలల్లోన్ని అధికారం చేపట్టి ఆంధ్రుల జాతి మరియు ఖ్యాతిని ప్రపంచానికి తెలియజేసిన మహానుభావుడని మాజీ మండల అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి, మాజీ సర్పంచ్,పివి సీతాపతి పేర్కొన్నారు బుధవారం రామకుప్పం మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు 14వ జయంతి ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించారు

ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో రోగులకు పాలు పళ్ళ బ్రెడ్ పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో సీనియర్ తెదేపా నేతలు రామకృష్ణప్ప, పద్మనబరెడ్డి, సలాం సబ్,రామలింగారెడ్డి, అక్బర్ సాబ్, హనీఫ్,పంచాయతీ పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి ,మాజీ ఎంపీటీసీలు అల్లి శ్రీనివాసులు, టీవీ రవి, నాగరాజు, అవినాష్ రెడ్డి, సుబ్రి ,నాగరాజు, మంజునాథ్ ,నారాయణస్వామి, వెంకటస్వామి, దయా, ఆదిల్, అంజి, చాంద్ భాషా, ని సార్,చలా పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

# పటిక బెల్లం తినడం వల్ల ఇన్ని లాభాలు ఉన్నాయా..?



పటిక బెల్లం.. దీని గురించి అందరికీ తెలుసు. దీన్ని ఎక్కువగా సోంపు గింజలతోపాటు తింటుంటారు. అయితే ఆయుర్వేద పరంగా పటిక బెల్లం ఎంతో ప్రాధాన్యతను కలిగి ఉంటుంది. పలు ఔషధాల తయారీలో, పలు వ్యాధులను నయం చేసేందుకు పటికబెల్లం ఉపయోగిస్తారు. ఇది చక్కెర లాగా తియ్యగా ఉంటుంది. కానీ ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. పటిక బెల్లాన్ని తినడం వల్ల మనం అనేక లాభాలను పొందవచ్చు. భోజనం చేసిన అనంతరం చిన్న పటిక బెల్లం ముక్కను తింటే జీర్ణక్రియ మెరుగు పడుతుంది. జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. కడుపు ఉబ్బరం సమస్య నుంచి బయట పడవచ్చు. గ్యాస్ ఏర్పడదు. తిన్న ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. అజీర్తి కూడా ఉండదు.

**జీర్ణ వ్యవస్థ పనితీరుకు..**

పటిక బెల్లాన్ని తినడం వల్ల జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. ఆయుర్వేద ప్రకారం పటిక బెల్లం మన శరీరానికి చలువ చేసే గుణాన్ని కలిగి ఉంటుంది. అందువల్ల పటిక బెల్లం కలిపిన నీళ్లను వేసవిలో తాగుతుంటే వేడి నుంచి ఉపశమనం లభిస్తుంది. వేసవి తాపం తగ్గుతుంది. శరీరం కోల్పోయిన ద్రవాలు, ఎలక్ట్రోలైట్స్‌ను తిరిగి పొందవచ్చు.

డీహైడ్రేషన్ సమస్య తగ్గుతుంది. పటిక బెల్లాన్ని తినడం వల్ల గొంతులో మంట, నొప్పి, గొంతు గరగరగా ఉండడం వంటి సమస్యలు తగ్గుతాయి. దగ్గు, జలుబు వంటి సమస్యల నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది. శ్వాస నాళాలు క్లియర్ అవుతాయి. గాలి సరిగ్గా ఆడుతుంది. శ్వాస తీసుకోవడంలో ఉండే ఇబ్బందులు తొలగిపోతాయి.


**రక్తహీనతకు..**

శ్వాస సమస్యల నుంచి ఉపశమనం పొందాలంటే పటిక బెల్లాన్ని గోరు వెచ్చని టీ లేదా పాలతో తీసుకోవాల్సి ఉంటుంది. ఇక పటిక బెల్లాన్ని తింటే ఐరన్ సమృద్ధిగా లభిస్తుంది. ఇది హిమోగ్లోబిన్ ఉత్పత్తిని పెంచుతుంది. దీంతో రక్తం తయారవుతుంది. రక్తహీనత తగ్గుతుంది. పటిక బెల్లం నోట్లో ఉండే బ్యాక్టీరియాను నాశనం చేస్తుంది. కనుక భోజనం చేసిన తరువాత దీన్ని తింటే నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్లు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. పటిక బెల్లాన్ని ఉదయం గోరు వెచ్చని నీటిలో కలిపి తాగితే శరీరానికి శక్తి లభిస్తుంది. ఉత్సాహంగా మారుతారు. బద్దకం పోతుంది. రోజంతా చురుగ్గా ఉంటారు. యాక్టివ్‌గా పనిచేస్తారు. శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి.

**మోతాదులోనే తినాలి..**

పటిక బెల్లాన్ని తినడం వల్ల శరీరం తాజాదనపు అనుభూతి చెందుతుంది. ఉత్సాహంగా మారుతారు. చురుగ్గా ఉంటారు. ఈ విధంగా పటిక బెల్లం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. డయాబెటిస్ ఉన్నవారు పటిక బెల్లాన్ని తీసుకోకూడదు. పటిక బెల్లం ఆరోగ్యానికి మంచిదే అయినప్పటికీ దీన్ని అతిగా తినరాదు. పటిక బెల్లాన్ని మోతాదుకు మించి తింటే దుష్పరిణామాలు కలుగుతాయి. పటిక బెల్లాన్ని పలు తీపి వంటకాల్లోనూ ఉపయోగిస్తారు. చక్కెర వాడడం ఇష్టం లేని వారు దీన్ని ప్రత్యామ్నాయంగా వాడవచ్చు. కానీ మోతాదులో తింటేనే ప్రయోజనాలు కలుగుతాయి.

# రోజూ గుప్పెడు నట్స్‌ను తింటే ఇన్ని ఉపయోగాలు ఉన్నాయా..?



బాదంపప్పు, జీడిపప్పు, పిస్తా, వాల్ నట్స్. ఇలా మనకు తినేందుకు అనేక రకాల నట్స్ అందుబాటులో ఉన్నాయి. కానీ ధర ఎక్కువ ఉంటుందని, లేదా మరేదైనా ఇతర కారణాల వల్ల ఈ గింజలను చాలా మంది తినడం లేదు. కానీ వాస్తవానికి ఈ గింజలను తింటే మనకు ఎన్నో లాభాలు కలుగుతాయి. వీటిన్నింటినీ కలిపి రోజుకు గుప్పెడు మోతాదులో రాత్రి పూట నీటిలో నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం తినాలి. ఇలా ఈ గింజలను తినడం వల్ల మనకు ఎన్నో లాభాలు కలుగుతాయి. నట్స్ మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిల్లో యాంటీ ఆక్సిడెంట్లతోపాటు విటమిన్లు, మినరల్స్ అధికంగా ఉంటాయి. ముఖ్యంగా బాదం, జీడిపప్పు, పిస్తా, వాల్ నట్స్, పల్లీలు వంటి గింజల్లో ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి.

**గుండె ఆరోగ్యానికి..**

చేపలను తినడం వల్ల లభించే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఈ గింజల్లోనూ ఉంటాయి. అందువల్ల చేపలను తినలేని వారికి ఈ గింజలు మంచి ఆహారం అని చెప్పవచ్చు. ఈ గింజల్లో కొలెస్ట్రాల్ ఉండదు. కానీ వీటిల్లో కొలెస్ట్రాల్ ఉంటుందని, అది గుండెకు హాని చేస్తుందని అనుకుంటారు. అందులో ఎంత మాత్రం నిజం లేదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. అలాగే ఈ నట్స్‌ను మోతాదులో తింటేనే అనేక ప్రయోజనాలు కలుగుతాయి. దేన్నీ అతిగా తినరాదు అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఈ నట్స్‌ను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల శరీరంలో ఉండే ఎల్‌డీఎల్ (చెడు కొలెస్ట్రాల్) తగ్గుతుంది. హెచ్‌డీఎల్ (మంచి కొలెస్ట్రాల్) పెరుగుతుంది. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

**జీర్ణ సమస్యలకు..**


నట్స్‌లో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు రక్తనాళాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. దీంతో రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీని వల్ల హార్ట్ ఎటాక్ రాకుండా ఉంటుంది. నట్స్‌లో ఉండే పీచు బరువు తగ్గడానికి సహాయం చేస్తుంది. ఈ నట్స్‌ను తింటే ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. కడుపు నిండిన భావనతో ఉంటారు. దీంతో జంక్ ఫుడ్ జోలికి వెళ్లరు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. నట్స్‌ను తినడం వల్ల జీర్ణ క్రియ మెరుగు పడుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. వీటిల్లో ఉండే ఫైబర్ గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం, అజీర్తి వంటి సమస్యలను తగ్గిస్తుంది. నట్స్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే డయాబెటిస్ వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని సైంటిస్టుల అధ్యయనాల్లో తేలింది.

**విటమిన్ ఇ అధికం..**

నట్స్‌లో విటమిన్ ఇ సమృద్ధిగా ఉంటుంది. ఇది రక్త నాళాల్లో కొవ్వు చేరకుండా చూస్తుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పోటు రాదు. పక్షవాతం వంటి జబ్బులు రాకుండా నివారిస్తుంది. నట్స్‌లో వృక్ష సంబంధ స్టెరాల్స్ అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ తగ్గేందుకు దోహదం చేస్తాయి.

గింజల్లో ఉండే ఎల్-ఆర్గినైన్ అనే సమ్మేళనం రక్త నాళాలను సాగేలా చేస్తుంది. దీంతో రక్త నాళాలు గట్టి పడకుండా ఉంటాయి. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఈ విధంగా పలు నట్స్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ప్రయోజనాలను పొందవచ్చు. అయితే అన్ని నట్స్‌ను తినకపోతే ఏదైనా ఒక రకానికి చెందిన నట్స్‌ను అయినా రోజూ గుప్పెడు మోతాదులో తినే ప్రయత్నం చేయాలి. దీంతో అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

# హై కొలెస్ట్రాల్‌తో ఇబ్బందిపడుతున్నారా..?



ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆరోగ్య సమస్యల్లో గుండెజబ్బులు ఒకటి. రక్తపోటు, కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉండే వ్యక్తులకు గుండె సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. కొలెస్ట్రాల్ పెరగడం తీవ్రమైన సమస్య. ఇది రక్త ప్రసరణను ప్రభావితం చేస్తుంది. ఇది గుండెపోటు వంటి ప్రాణాంతక సమస్యల ప్రమాదాన్ని పెంచుతుంది. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి కొలెస్ట్రాల్ అవసరం. ఇది శరీరంలోని ప్రతి కణంలో కనిపించే కొవ్వు పదార్థం (లిపిడ్). ఇది హార్మోన్ల ఉత్పత్తికి, విటమిన్-డీ ఉత్పత్తికి, ఆహారాన్ని జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. కొలెస్ట్రాల్ శరీరానికి చాలా అవసరం, కానీ దాని అధికం గుండె జబ్బులు, ఇతర ఆరోగ్య సమస్యలకు కారణమవుతుంది. కొలెస్ట్రాల్ పెరిగేందుకు అనేక కారణాలు ఉండొచ్చు. మెరుగైన జీవనశైలి, ఆహారపు అలవాట్లు లేని వ్యక్తులు హై కొలెస్ట్రాల్‌తో బాధపడే అవకాశం ఉంది.

జంక్ ఫుడ్స్ వంటి వాటిలో అధిక సంతప్త, ట్రాన్స్‌ఫ్యాట్ కంటెంట్ ఉన్న ఆహారాలు, వేయించిన ఆహారాలు వంటి అసమతుల్య ఆహారాలు కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. శారీరకంగా చురుకుగా లేకుంటే.. వ్యాయామం చేయకపోతే, చెడు కొలెస్ట్రాల్‌ను కూడా పెంచుతుంది. అధిక బరువు, ఊబకాయం, ధూమపానంతో పాటు మద్యపాన అలవాట్లు కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. కొలెస్ట్రాల్‌ను నియంత్రించేందుకు జీవనశైలి, ఆహారపు అలవాట్లు మెరుగుపరచడం చాలా ముఖ్యమని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. పోషకాహారమైన ఆహారం చాలా కీలకమైంది. 80/20 విధానంతో కొలెస్ట్రాల్‌ను నియంత్రించుకోవచ్చు. ఈ రూల్ ప్రకారం.. మీ ఆహారంలో 80శాతం ఆరోగ్యకరమైన ఆహారాలు ఉండాలి. ఫైబర్ అధికంగా ఉండే, తక్కువ కొవ్వు, తక్కువ చక్కెర ఉన్న ఆహారం తీసుకోవాలి. కొలెస్ట్రాల్ పెరుగుదలను నియంత్రించేందుకు 80శాతం చురుగ్గా ఉండాల్సిందే.

క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ఆఫీసులో ఎక్కువగా కూర్చోకుండా కొంత సమయం నడవాలి. అలాగే, 20శాతం మీకు నచ్చిన మితమైన ఆహారాన్ని తీసుకోవాలి.

లేకపోతే శరీరానికి విశ్రాంతిని ఇవ్వాలి. కొలెస్ట్రాల్ ఎక్కువగా పెరగకుండా ఉండేందుకు ఆలివ్ నూనె, వేరుశెనగ నూనె, అవకాడో, అవిసె గింజలను ఆహారంలో చేర్చుకోవాలి. ఓట్ మీల్, తృణధాన్యాలు, ఆపిల్, బేరి, పప్పులు, ఆకుకూరలు తదితర ఫైబర్ అధికంగా ఆహారాలను తప్పనిసరిగా తీసుకోవాలి. బిస్కెట్లు, చిప్స్, ఫాస్ట్-జంక్ ఫుడ్స్ అధికంగా తీసుకోవడం మానాల్సిందే. ప్రతిరోజూ క్రమం తప్పకుండా 30 నిమిషాలు వ్యాయామం చేయాలి. వాకింగ్, రన్నింగ్, సైక్లింగ్ చేయడం అలవాటు చేసుకోవాలి. కొలెస్ట్రాల్ పెరుగుదల గుండెకు మాత్రమే కాకుండా శరీరంలోని అనేక భాగాలకు కూడా ప్రమాదకరమని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు.

కాబట్టి కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుకోవడం ముఖ్యం. యువత అధికంగా కొలెస్ట్రాల్ ఎక్కువగా బాధితులుగా మారే అవకాశం ఉందా? 30 సంవత్సరాలు పైబడిన వారంతా తప్పనిసరిగా క్రమం తప్పకుండా కొలెస్ట్రాల్ టెస్ట్ చేయించుకోవాలని సూచిస్తున్నారు.

# ఈ కూరను తింటే లాభాలు బోలెడు..!



పుంటి కూర.. దీన్నే గోంగూర అని కూడా అంటారు. మనకు ఏ సీజన్‌లో అయినా సరే గోంగూర ఎక్కువగానే లభిస్తుంది. ముఖ్యంగా వేసవిలో పుల్ల పుల్లగా ఉండే పుంటి కూరను తింటే వచ్చే మజాయే వేరు. దీంతో పప్పు, పచ్చడి, పులుసు వంటివి చేసి తింటారు. అన్నంలో ఈ కూరలను వేసి కలిపి నెయ్యితో తింటే రుచి అదిరిపోతుంది. పుంటి కూర పప్పు లేదా పచ్చడి సూపర్‌గా ఉంటాయి. అయితే ఆరోగ్య పరంగా చూస్తే ఈ కూర మనకు అనేక లాభాలను అందిస్తుంది. పుంటి కూరను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. దీంట్లో అనేక పోషకాలు ఉంటాయి. పుంటి కూరలో ఐరన్ అధికంగా ఉంటుంది. కనుక రక్తహీనత ఉన్నవారు పుంటి కూరను తింటే రక్తం బాగా తయారవుతుంది. రక్తహీనత నుంచి బయట పడవచ్చు. హిమోగ్లోబిన్ శాతం కూడా పెరుగుతుంది.

**ఎముకలు బలంగా..**

పుంటి కూరలో క్యాల్షియం, ఐరన్, విటమిన్ ఎ, సి, రైబోఫ్లేవిన్, ఫోలిక్ యాసిడ్ అధికంగా ఉంటాయి. పుంటి కూరలో ఉండే క్యాల్షియం ఎముకలను బలంగా మారుస్తుంది. ఈ కూరలో ఉండే విటమిన్ ఎ కంటి చూపును మెరుగు పరుస్తుంది. దీంతో కంటి సమస్యలు తగ్గుతాయి. పుంటి కూరలో ఉండే ఫోలిక్ యాసిడ్ గర్భిణీలకు ఎంతో మేలు చేస్తుంది. ఈ కూరలో పీచు కూడా అధికంగానే ఉంటుంది. ఇది జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. గ్యాస్, అసిడిటీ, కడుపు ఉబ్బరం, మలబద్ధకం నుంచి బయట పడవచ్చు. పుంటి కూరలో రెండు రకాలు ఉంటాయి. ఒకటి తెల్లది కాగా మరొకటి ఎర్రది. ఎర్రని పుంటి కూరను మనం తరచూ వంటల్లో వాడుతాం. తెల్లని పుంటి కూరతో నిల్వ పచ్చడి పెడుతుంటారు. ఇది టేస్ట్‌లో అదిరిపోతుంది.

**గాయాలు, పుండ్లకు..**

గాయాలు, పుండ్లను తగ్గించడంలోనూ పుంటి కూర పనిచేస్తుంది. వాటిపైన ఈ ఆకులను ఆముదంతో వేడి చేసి కట్టులా కడుతుంటే అవి త్వరగా మానుతాయి. గడ్డలు ఉంటే కరిగిపోతాయి. దీంతోపాటు నొప్పులు, వాపుల నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది. పుంటి కూరలో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. అందువల్ల ఈ కూరను తరచూ తింటే రేచీకటి తగ్గుతుంది. కళ్లు స్పష్టంగా కనిపిస్తాయి. దృష్టి దోషంతో బాధపడేవారు తరచూ పుంటి కూరను తింటే మేలు జరుగుతుంది. అలాగే పుంటి కూర మొక్క పూలను దంచి రసం తీసి దాన్ని వడ కట్టి అందులో అర కప్పు పాలు కలిపి ఉదయం, సాయంత్రం రెండు పూటలా సేవించాలి. దీంతో కూడా రేచీకటి సమస్య తగ్గుతుంది. కంటి చూపు పెరుగుతుంది.

**విరేచనాలు తగ్గేందుకు..**

బోదకాలు తగ్గడానికి శరీరంలో వాపులు తీయడానికి గోంగూర, వేపాకు కలిపి నూరి ఆ పదార్థాన్ని పట్టించాలి. విరేచనాలు అధికంగా అవుతుంటే తెల్ల పుంటి కూర నుంచి తీసిన జిగురును నీటిలో కలిపి తాగితే కట్టుకుంటాయి. మిరపకాయలు వేయకుండా ఉప్పులో ఊరవేసిన పుంటి కూరను అన్నంతో తిన్నా విరేచనాలు తగ్గిపోతాయి. దగ్గు, ఆయాసం తుమ్ములతో ఇబ్బంది పడేవారు ఈ కూరను ఏదో విధంగా తింటే స్వస్థత కలుగుఉంది. దగ్గు ఆయాసం తుమ్ములతో బాధపడే వారికి చాలామేలు చేస్తుంది. శరీరంలో నీరు చేరినప్పుడు ఈ ఆకు కూర పథ్యం చాలా మంచిది. పుంటి కూర మలబద్ధకాన్ని, రేచీకటిని తొలగిస్తుంది. శరీరంలో వేడి ఎక్కువగా ఉన్నవారు, వాతం చేసిన వారు పుంటి కూరను తినకూడదు.

## గ్యాస్, అజీర్తి, మలబద్ధకం, కడుపులో మంటకు..

# సహజసిద్ధమైన చిట్కాలు..



జీర్ణ సమస్యలు అనేవి మనకు సహజంగానే వస్తుంటాయి. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోతే అజీర్తి వస్తుంది. దీంతోపాటు పొట్టలో గ్యాస్ ఏర్పడుతుంది. కారం, మసాలాలు ఉండే ఆహారాలను అతిగా తిన్నా కూడా ఇలా జరుగుతుంది. కొందరికి వీటిని తింటే కడుపులో మంట కూడా ఏర్పడుతుంది. అలాగే టీ, కాఫీలను అధికంగా తాగడం, ఒత్తిడి ఎక్కువగా ఉండడం, వ్యాయామం చేయకపోవడం, పీచు లేని ఆహారాలను తినడం, అతిగా తినడం వంటివి కూడా జీర్ణ సమస్యలకు కారణం అవుతాయి. అయితే జీర్ణ సమస్యలు వచ్చాక బాధపడడం కంటే అవి రాక ముందే జాగ్రత్త పడాలి. చాలా వరకు జీర్ణ సమస్యలు మనం తీసుకునే ఆహారం వల్లే వస్తుంటాయి. కనుక ఆహారం విషయంలో జాగ్రత్తలు అవసరం. అయితే జీర్ణ సమస్యలు వస్తే ఇంగ్లిష్ మెడిసిన్‌ను వాడాల్సిన పనిలేదు. మన ఇంట్లో ఉండే పదార్థాలతోనే సహజసిద్ధంగా ఈ సమస్యల నుంచి బయట పడవచ్చు. అందుకు ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.

**నేరేడు పండ్లు..**

జీర్ణ సమస్యలను తగ్గించడంలో నేరేడు పండ్ల గింజలు ఎంతో ఉపయోగపడతాయి. నేరేడు పండ్ల గింజలకు చెందిన పొడి మనకు మార్కెట్‌లో లభిస్తుంది. ఈ పొడిని తెచ్చుకోవాలి. ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో ఈ పొడిని ఒక టీస్పూన్ మోతాదులో కలిపి తాగుతుండాలి. దీంతో ఎలాంటి జీర్ణ సమస్య అయినా సరే తగ్గిపోతుంది. అలాగే ఈ సీజన్‌లో లభించే నేరేడు పండ్లను తింటున్నా కూడా జీర్ణ సమస్యలకు చెక్ పెట్టవచ్చు. ఇక జీర్ణ సమస్యలను తగ్గించడంలో అల్లం కూడా అద్భుతంగానే పనిచేస్తుంది. భోజనం చేయడానికి ముందు ఒక టీస్పూన్ అల్లం రసాన్ని ఉదయం, సాయంత్రం రోజుకు 2 సార్లు సేవించాలి. దీని వల్ల జీర్ణాశయం, పేగుల్లో ఉండే వాపులు తగ్గుతాయి. కడుపు నొప్పి, గ్యాస్, అసిడిటీ నుంచి ఉపశమనం లభిస్తుంది. మలబద్ధకం తగ్గుతుంది. జీర్ణ సమస్యలను తగ్గించడంలో అల్లం అద్భుతంగా పనిచేస్తుంది.

**సోంపు గింజలు..**

భోజనం చేసిన అనంతరం ఒక గుప్పెడు సోంపు గింజలను తింటున్నా కూడా జీర్ణ సమస్యలు తగ్గుతాయి. సోంపు గింజలను తింటే కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనం లభిస్తుంది. పొట్టలో ఉండే గ్యాస్ మొత్తం పోతుంది. అజీర్తి, విరేచనాలు, మలబద్ధకం తగ్గుతాయి. జీర్ణ సమస్యలను తగ్గించడంలో సోంపు అద్భుతంగా పనిచేస్తుంది. పేగుల ఆరోగ్యం కూడా మెరుగు పడుతుంది. జీర్ణ సమస్యలు ఉన్నవారు త్రిఫల చూర్ణం కూడా తీసుకోవచ్చు. రాత్రి పూట ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో పావు టీస్పూన్ త్రిఫల చూర్ణం కలిపి తాగాలి. దీంతో మరుసటి రోజు సుఖ విరేచనం అవుతుంది. మలబద్ధకం ఉండదు. జీర్ణాశయం, పేగులు శుభ్రంగా మారుతాయి. శరీరంలోని వ్యర్థాలు, టాక్సిన్లు బయటకు పోతాయి. త్రిఫల చూర్ణం కూడా జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది.

**పుదీనా ఆకులు..**

పుదీనా ఆకులు మన శరీరానికి చలువ చేస్తాయి. కనుక ఈ ఆకులను తింటే కడుపులో మంట తగ్గుతుంది. పుదీనా ఆకుల రసాన్ని మజ్జిగలో కలిపి తాగుతుంటే అన్ని జీర్ణ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. పుదీనా ఆకులను నేరుగా కూడా నమిలి తినవచ్చు. భోజనానికి ముందు ఈ ఆకులను తింటే గ్యాస్ ఏర్పడదు. అజీర్తి తగ్గుతుంది. ఆకలి పెరుగుతుంది. పొట్టలో ఉండే అసౌకర్యం తగ్గుతుంది. అలాగే జీర్ణ సమస్యలను తగ్గించడంలో తుమ్మ జిగురు కూడా బాగానే పనిచేస్తుంది. మలబద్ధకాన్ని ఇది తగ్గిస్తుంది. ఐబీఎస్ వంటి సమస్యలు ఉన్నవారు తుమ్మ జిగురును వాడితే ప్రయోజనం ఉంటుంది. బొప్పాయి పండ్లను ఆహారంలో భాగం చేసుకున్నా కూడా జీర్ణ సమస్యలు ఉండవు. ముఖ్యంగా తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. గ్యాస్, కడుపు ఉబ్బరం తగ్గుతాయి. మలబద్ధకం నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇలా పలు రకాల పదార్థాలు మనకు ఏర్పడే జీర్ణ సమస్యలను తగ్గించడంలో బాగా పనిచేస్తాయి.

# సెంచరీ సంబరం.. గాలిలో పల్టీ కొట్టిన రిషబ్ పంత్..

లక్నో: ఆర్సీబీతో జరిగిన ఐపీఎల్ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో లక్నో బ్యాటర్ రిషబ్ పంత్ సెంచరీతో చెలరేగాడు. కేవలం 54 బంతుల్లో అతను సెంచరీ పూర్తి చేశాడు. ఈసారి ఐపీఎల్‌లో పెద్దగా ఫామ్‌లో లేని పంత్.. లీగ్ చివరి మ్యాచ్‌లో మాత్రం తన స్ట్రోక్ ప్లేతో అలరించాడు. సెంచరీ పూర్తి అవ్వగానే బ్యాట్‌ను, హెల్మెట్‌ను పక్కన పడేసి.. గాలిలో పల్టీ కొట్టాడు పంత్. జిమ్నాస్ట్ తరహాలో గాలిలో ఎగిరి తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు. నిజానికి ఈ సీజన్ ఐపీఎల్‌లో పంత్ తన బ్యాటింగ్ పవర్ చూపించలేకపోయాడు. ఎట్టకేలకు లాస్ట్ మ్యాచ్‌లో సెంచరీతో మళ్లీ ఫామ్‌లోకి వచ్చేశాడు. ఈ మ్యాచ్‌లో పంత్ 118 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. పంత్ సెలబ్రేషన్‌కు చెందిన వీడియోను మీరూ వీక్షించండి. పంత్ సెంచరీ చేసినా ఆ జట్టుకు విజయం దక్కలేదు. ఆ మ్యాచ్‌లో బెంగుళూరు ఆరు వికెట్ల తేడాతో నెగ్గింది. మొదట బ్యాటింగ్ చేసిన లక్నోకు.. రిషబ్ పంత్ (61 బంతుల్లో 118 నాటౌట్, 11 ఫోర్లు, 8 సిక్సర్లు) అజేయ శతకంతో చెలరేగగా మిచెల్ మార్ష్ (37 బంతుల్లో 67, 4 ఫోర్లు, 5 సిక్సర్లు)



రాణించడంతో ఆ జట్టు 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 227 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఆర్సీబీ.. మరో 8 బంతులు ఉండగానే లక్ష్యాన్ని అందుకున్నది. జితేశ్ శర్మ మెరుపు బ్యాటింగ్‌తో ఆర్సీబీ ఖాతాలో విక్టరీ పడింది. జితేశ్ 85 నాటౌట్, కోహ్లీ 54 రన్స్ చేశారు.

# కిస్సులిచ్చుకున్న కోహ్లీ, అనుష్కా..

లక్నో: ఆర్సీబీ మంగళవారం ఓ అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఐపీఎల్ ఆఖరి లీగ్‌లో లక్నోపై భారీ టార్గెట్‌ను ఛేజ్ చేసింది. ఇక ఆ అపురూప క్షణాలను ఆర్సీబీ మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ ఫుల్ ఎంజాయ్ చేశాడు. జితేశ్ విక్టరీ షాట్ కొట్టగానే.. డగౌట్‌లో ఉన్న కోహ్లీ కసి తీరా చిందేశాడు. ఆ తర్వాత ప్లేయర్లను కలుకున్న అతను ఆ సందర్భాన్ని కూడా తెగ ఎంజాయ్ చేశాడు. థ్రిల్లింగ్ మ్యాచ్‌లో ఆరు వికెట్ల తేడాతో ఆర్సీబీ విజయం సాధించింది. అయితే మ్యాచ్ ముగిశాక.. గ్రౌండ్‌లో ఉన్న కోహ్లీ, ప్రేక్షకుల గ్యాలరీలో ఉన్న అనుష్కా .. ఒకరికి ఒకరు గాలిలో కిస్సులు ఇచ్చారు. అనుష్కా వైపు చూస్తూ చేయితో కిస్ ఇచ్చాడు కోహ్లీ. ఇక స్టాండ్స్‌లో ఉన్న అనుష్కా కూడా ఆ సంతోషాన్ని ఆపుకోలేక గాలిలో రిటర్న్ కిస్ ఇచ్చింది. ఆ వీడియో ఇప్పుడు యమ వైరల్ అవుతున్నది.



# సెంచరీ హీరో పంత్‌కు జరిమాన.. 30 లక్షల ఫైన్

లక్నో: లక్నో సూపర్ గెయింట్స్ కెప్టెన్ రిషబ్ పంత్‌కు .. 30 లక్షల జరిమానా విధించారు. ఐపీఎల్‌లో ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో లక్నో జట్టు స్లో ఓవర్ రేట్‌తో బౌలింగ్ చేసింది. ఈ నేపథ్యంలో లక్నో జట్టుకు ఫైన్ వేశారు. అయితే లక్నో ప్లేయర్లకు కూడా 12 లక్షల జరిమానా విధించారు. దీంట్లో ఇంపాక్ట్ ప్లేయర్ కూడా ఉన్నాడు. ఈ సీజన్‌లో ప్రవర్తనా నియమావళిని మూడోసారి లక్నో జట్టు ఉల్లంఘించినట్లు ఐపీఎల్ తన ప్రకటనలో తెలిపింది. అందుకోసమే పంత్‌కు 30 లక్షలు ఫైన్ వేసినట్లు చెప్పింది. లక్నో జట్టులోని మిగితా ఆటగాళ్లకు 12 లక్షలు లేదా 50 శాతం ఫీజులో కోత విధించనున్నారు.

హై స్కోరింగ్ గేమ్‌లో ఆర్సీబీ జట్టు ఆరు వికెట్ల తేడాతో లక్నోపై విజయం సాధించింది. రిషబ్ పంత్ సెంచరీ చేసినా తమ జట్టుకు విక్టరీని అందించలేకపోయాడు. ఈ మ్యాచ్‌లో అతను 61 బంతుల్లో 118 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఆర్సీబీ ఈ గెలుపుతో క్వాలిఫయర్ 1కు వెళ్లింది. గురువారం చండీఘడ్‌లో ఆ జట్టు పంజాబ్ కింగ్స్‌తో ఆడనున్నది.



# లక్నోపై విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్న ఆర్సీబీ ఫ్యాన్స్‌కు అదిరిపోయే గుడ్‌న్యూస్



ఆర్‌సిబి లక్నోపై విజయం సాధించి ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది. ఈ విజయానంతరం, డీకే స్టార్ బౌలర్ జోష్ హేజిల్‌వుడ్ ప్లేఆఫ్స్‌లో ఆడతారని ప్రకటించారు. గత కొన్ని మ్యాచ్‌లలో ఆర్‌సిబి బౌలింగ్ బలహీనంగా ఉండటంతో ఇది ఆ జట్టుకు గుడ్ న్యూస్. హేజిల్‌వుడ్ ఈ సీజన్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ కావడం విశేషం.

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మెరుగైన ప్రదర్శన కొనసాగిస్తోంది. మంగళవారం లక్నో సూపర్ జెయింట్స్ పై జరిగిన మ్యాచ్ లో ఆర్సీబీ ఘన విజయం సాధించి తొలి క్వాలిఫయర్ కు అర్హత సాధించింది.

మే 29న జరిగే మొదటి క్వాలిఫయర్ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ తలపడతాయి. ఈ మ్యాచ్ కంటే ముందు ఆర్సీబీకి ఆ జట్టు మెంటర్ దినేష్ కార్తీక్ గుడ్ న్యూస్ చెప్పాడు. స్టార్ బౌలర్ జోష్ హేజిల్‌వుడ్ క్వాలిఫైయర్ ఆడతాడంటూ అదిరిపోయే న్యూస్ చెప్పాడు.

ఎల్ఎస్‌జీతో జరిగిన మ్యాచ్ తర్వాత డీకే మాట్లాడుతూ, జోష్ హేజిల్‌వుడ్ పూర్తిగా ఫిట్‌గా ఉన్నాడని, తదుపరి మ్యాచ్‌లో మైదానంలోకి దిగడానికి సిద్ధంగా ఉన్నాడని చెప్పాడు. దీని ప్రకారం, పంజాబ్ కింగ్స్‌తో జరిగే మ్యాచ్‌లో హేజిల్‌వుడ్ %=జదీ%కి తిరిగి వస్తాడని ప్రకటించారు.

ఇంతలో, జోష్ హేజిల్‌వుడ్ అందుబాటులో లేకపోవడంతో %=జదీ% బౌలింగ్ ప్రదర్శన పేలవంగా ఉంది. ముఖ్యంగా గత రెండు మ్యాచ్‌ల్లో ఆర్సీబీ పేసర్లు ఆశించిన స్థాయిలో రాణించలేదు. హేజిల్‌వుడ్ ఇప్పుడు ప్లేఆఫ్‌లోకి ప్రవేశించడం %=జదీ%కి ప్లస్ పాయింట్.

ఎందుకంటే ఈ ఏడాది ఐపీఎల్‌లో ఆర్‌సిబి తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ జోష్ హేజిల్‌వుడ్. గత 10 మ్యాచ్‌ల్లో హాజిల్‌వుడ్ 36.5 ఓవర్లు బౌలింగ్ చేసి మొత్తం 18 వికెట్లు పడగొట్టాడు. అతను మొత్తం 103 డాట్ బాల్స్ బౌలింగ్ చేయడం ద్వారా కూడా మెరిశాడు. అందువల్ల, జోష్ హేజిల్‌వుడ్ రాక %=జదీ% బౌలింగ్ లైనప్‌ను మరింత బలోపేతం చేస్తుందనడంలో సందేహం లేదు.

# బాబోయ్ స్విమ్మింగ్ పూల్‌లో అనసూయ రచ్చ..

అందాల ముద్దుగుమ్మ అనసూయ నిత్యం వార్తలలో నిలుస్తుంటుంది. ఈ అమ్మడు ఏం చేసిన అది వార్తనే. ఈ మధ్య అనసూయ కొత్తింటి గృహప్రవేశం చేసింది. అత్యాధునిక సౌకర్యాలతో కూడిన విలాసవంతమైన ఇంటిలో అడుగుపెట్టింది. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఆ తర్వాత వెంటనే కుమారుడి ఉపనయనం వేడుక కూడా జరిపింది. అందుకు సంబంధించిన ఫొటోలని కూడా సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఇక ఈ వేడుకలు పూర్తైన వెంటనే ఫ్యామిలీతో కలిసి శ్రీలంకలో వాలింది.

సమ్మర్ వెకేషన్‌లో భాగంగా శ్రీలంకకి వెళ్లిన అనసూయ..అక్కడ తమ ఎంజాయ్‌మెంట్‌కి సంబంధించిన ప్రతి విషయాన్ని ఇన్‌స్టా ద్వారా షేర్ చేస్తుంది. తాజాగా అనసూయ తన సోషల్ మీడియాలో కొన్ని ఫొటోలను షేర్ చేసింది. ఫ్యామిలీతో కలిసి వెకేషన్‌కు వెళ్లిన ఫొటోలను తన సోషల్ మీడియాలో షేర్ చేసింది అనసూయ. ఈ క్రమంలో అనసూయ అభిమానులకు బికినీ ట్రీట్ ఇచ్చింది. తన ఇద్దరు కుమారులు, భర్తతో ఆహ్లాదంగా గడుపుతూ స్విమ్మింగ్ పూల్‌లో ఎంజాయ్ చేస్తున్న ఫొటోలు, వీడియోలు షేర్ చేసింది. గతంలో కూడా అనసూయ పలు సందర్భాలలో బికినీ ఫొటోలు షేర్ చేసి ఫ్యాన్స్ కి



మాంచి కిక్ ఇచ్చింది. మరోవైపు స్విమ్మింగ్ పూల్ లో అనసూయ తన భర్తతో రొమాంటిక్ గా కనిపించింది. ఇక అనసూయ మరి కొద్ది రోజుల పాటు శ్రీలంకలోనే ఉండనుండగా, ఇంకెన్ని ట్రీట్స్ ఇస్తుందో అని ఫ్యాన్స్ ముచ్చటించుకుంటున్నారు. న్యూస్ రీడర్‌గా కెరీర్ మొదలు పెట్టిన అనసూయ..ఆ తర్వాత యాంకర్‌గా అలరించింది. ఇక నటిగాను అదరగొడుతుంది. ఈ బ్యూటీ. క్షణం, రంగస్థలం,కథనం, విమానం , పుష్ప, కిలాడి మొదలగు సూపర్ హిట్ సినిమాల్లో నటించి నటిగా తనకు ఎదురులేదనిపించింది. రంగస్థలం సినిమా తర్వాత అనసూయ వరుస సినిమాల్లో నటిస్తూ బిజీ ఆర్టిస్ట్‌గా మారిపోయింది.. హీరోయిన్లతో సమానంగా అనసూయ క్రేజ్ ఉందంటే.. ఆమె ప్రభావం ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక సోషల్ మీడియాలో చెక్కుచెదరని అభిమానాన్ని సొంతం చేసుకొని మిలియన్ల సంఖ్యలో ఫాలోవర్స్ సంపాదించుకుంటుంది ఈ ముద్దుగుమ్మ.

# కన్నప్ప నుంచి 'శ్రీకాళహస్తి' ఫుల్ సాంగ్ విడుదల

టాలీవుడ్ నటుడు మంచు విష్ణు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'కన్నప్ప' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. జూన్ 27న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, విడుదలకు నెల రోజుల సమయం మాత్రమే ఉండటంతో ప్రమోషన్ కార్యక్రమాలను వేగవంతం చేశారు మంచు విష్ణు. ఈ నేపథ్యంలోనే సినిమాలోని ఒక ప్రత్యేక భక్తి గీతాన్ని తాజాగా విడుదల చేశారు మేకర్స్. 'కన్నప్ప' చిత్రం నుండి "శ్రీకాళహస్తి" అనే లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ భక్తి గీతానికి ఒక ప్రత్యేక ఆకర్షణ తోడైంది. మంచు విష్ణు కుమార్తెలు అరియానా, వివియానా ఈ పాటను ఆలపించారు. వారి గాత్రం ఈ పాటకు మరింత ఆధ్యాత్మికతను జోడించిందని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. స్టీఫెన్ దేవస్సీ ఈ పాటకు అద్భుతమైన సంగీతాన్ని అందించారు. ఈ ఆధ్యాత్మిక గీతం ప్రేక్షకులను ఎంతగానో



ఆకట్టుకుంటూ, సినిమాపై అంచనాలను పెంచుతోంది.

# కుర్ర హీరోయిన్స్‌కు పోటీనిస్తున్న సీనియర్ ముద్దుగుమ్మలు







పెళ్లికి ముందు ఏ హీరోయిన్ అయినా స్టార్ స్టేటస్ ఎంజాయ్ చేస్తారు.. అందులో గొప్పేముంది..? కానీ ఇంటిపేరు మారాక.. మూడు ముళ్లు పడ్డాక కూడా అదే దూకుడు చూపిస్తుంటే అప్పుడే కదా అసలు మజా..! ఇప్పుడలాంటి మ్యారీడ్ హీరోయిన్స్ చాలా మందున్నారు. ఇండస్ట్రీలో పెళ్లైన హీరోయిన్స్ ధాటిని.. కుర్ర భామలు తట్టుకోలేకపోతున్నారు.

పెళ్లైన హీరోయిన్లను ఒకప్పుడు అక్క, వదిన పాత్రలతో సరిపెట్టేవాళ్లు. కానీ ఇప్పుడలా కాదు.. పెళ్లి తర్వాతే వాళ్ల డిమాండ్ పెరిగింది. టాలీవుడ్ టూ బాలీవుడ్ అదే ట్రెండ్ ఇప్పుడు. నయనతార, అలియా భట్, కత్రినా, దీపిక, కియారా, రకుల్.. ఇలా పెళ్లైన ముద్దుగుమ్మలంతా ఇండస్ట్రీని రూల్ చేస్తున్నారిప్పుడు.నయనతారనే తీసుకోండి.. పెళ్లి తర్వాత ఈమె రేంజ్ ఇంకాస్త పెరిగింది. ఒక్కో సినిమాకు 10 కోట్లకు పైగా తీసుకుంటున్న నయన్.. ప్రస్తుతం తెలుగులో చిరు, అనిల్ సినిమాలో నటిస్తున్నారు. కాజల్ కూడా వరస అవకాశాలు అందుకుంటున్నారు. విడాకుల తర్వాత సమంత దూకుడు మామూలుగా లేదు. కియారా అద్వానీ మొన్న వార్ 2 టీజర్‌లో 3 సెకన్లతోనే సంచలనం రేపారు.బాలీవుడ్‌లోనూ శ్రీమతుల హవానే నడుస్తుంది. అక్కడ కత్రినా కైఫ్, అలియా భట్, దీపిక పదుకొనే లాంటి మ్యారీడ్ హీరోయిన్లే రూల్ చేస్తున్నారు. వీళ్లలో ఏ ఒక్కరూ ఆఫ్టర్ మ్యారేజ్ సినిమాలు మానేస్తామనట్లేదు.. పైగా వాళ్లకే ఎక్కువగా ఆఫర్స్ ఇస్తున్నారు మేకర్స్. వీళ్ళ ధాటికి.. కుర్ర హీరోయిన్లు కూడా చేతులెత్తేస్తున్నారు. అలా ఉంది పెళ్లైన భామల దూకుడు.





EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY MARREDDY RAMAKRISHNA REDDY AND PUBLISHED FROM D.NO: 5-87-68, LAKSHMIPURAM MAIN ROAD ,GUNTUR VILLAGE , GUNTUR-522002. (A.P.) AND PRINTED AT PRAJA RAKSHA, D.NO: 5-87-68, LAKSHMIPURAM MAIN ROAD ,GUNTUR VILLAGE , GUNTUR-522002. (A.P.) PH: 9859472999. E-MAIL: PRAJA RAKSHA.GNT@GMAIL.COM